కాత్యాయని దేవి రూపంలో చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మ వారు

చార్మినార్,మార్చి 24 ప్రభాతవార్త :
చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అత్యంత వైభవంగా ఉగాది చైత్ర నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి.19వ తేదీ గురువారం ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు 27వ తేదీ వరకు జరగనున్నాయి.26వ తేదీన అష్టమి హవనం సాయంత్రం 7 గంటలు నుంచి రాత్రి 12 గంటలు వరకు,భాగ్యలక్ష్మీ అమ్మ వారి మోహినీ రూపం,మరియు ఛప్పన్ భోగ్ దర్శనం ఉంటుందని మందిరం ట్రస్టీ శశికళతెలిపారు.కాగా ఉగాది చైత్ర నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మంగళవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారు శ్రీ కాత్యాయని దేవి రూపంలో భక్తులకు కనిపించారు. భక్తులు అమ్మ వారిని దర్శించి ఆశీర్వాదాల పొందారు.27 శుక్రవారం రోజున చార్మినార్ శ్రీ భాగ్య లక్ష్మీ అమ్మవారి పల్లకి సేవా ఊరేగింపు సాయంత్రం 5 గంటలకు మందిరం నుంచి ప్రారంభమ వుతుందని శశికళ తెలియజేశారు.

హైదరాబాద్ వార్త

పాతబస్తీలో గ్యాస్ కోసం ఆటోల బారులు

- బంక్‌ల వద్ద భారీ క్యూలైన్లు - ఆప్రాంతంలో ట్రాఫిక్ జామ్ - ఎలాంటి సమస్యలేదన్న సిపి

లాల్‌దర్వాజా వెంకట్రావు స్కూల్ సమీపంలోని ప్రైవేటు గ్యాస్‌బంక్ వద్ద గ్యాస్ కోసం బారులు తీరిన ఆటోలు

చాంద్రాయణగుట్ట, మార్చి 24, ప్రభాతవార్త : ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల యుద్ధ ప్రభావం పెట్రోలు ఉత్పత్తులపై పడింది. గత కొన్ని రోజులుగా జనం గృహ, వాణిజ్య గ్యాస్ కోసం కటకట పడుతుండగా తాజాగా వాహనాల గ్యాస్, పెట్రోలు బంక్‌లు జతైయ్యాయి. కొన్ని పెట్రోలు, గ్యాస్ బంక్‌ల వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. యుద్ధం ప్రారంభమై నాల్గోవారానికి చేరుకున్న సమయంలో పెట్రోలు, వంట, వాణిజ్య గ్యాస్, వాహనాలలో ఉపయోగించే ఎల్‌పీజీ, సీఎన్‌జీ గ్యాస్‌కు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సరఫరా పూర్తి స్థాయిలో జరగటం లేదంటుంది. ఈ క్రమంలో పెట్రోలు, గ్యాస్ బంక్‌ల వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. వంట, వాణిజ్య గ్యాస్‌ల అన్‌లైన్ బుకింగ్‌కు ఇబ్బందులు ఎదురైతున్నాయి. దీంతో జనాలు నేరుగా సంబంధిత గ్యాస్ డీలర్ల కార్యాలయాల వద్ద గ్యాస్‌బండతో బారులు తీరుతున్నారు.

గ్యాస్‌బంక్‌ల వద్ద బారులు

పాతనగర వ్యాప్తంగా గ్యాస్‌తో నడిచే ఆటోలు గ్యాస్ కోసం సమీప బంకుల వద్ద బారులు తీరుతున్నాయి. తెల్లవారు జాము నుండే క్యూ కడుతున్నాయి. బంక్‌లు తెరవక ముందే గ్యాస్ కోసం నిరీక్షిస్తున్నారు. యుద్ధ ప్రభావం వంట గ్యాస్‌తోపాటు ఇతరత్రాపై పడింది. ఇందులో వాహనాలలో ఉపయోగించే సీఎన్‌జీ గ్యాస్ చేరింది. నిత్యం ఆటో నడిపి జీవనం సాగించే ఆటోడ్రైవర్లు గ్యాస్ దొరకక ఇబ్బంది పడుతున్నారు. గ్యాస్, పెట్రోలు ప్రభావంతో ఆటో ఛార్జీలు పెంచటం వల్ల ప్రయాణికులు సరిగా రావటం లేదని ఆవేదన చెందుతున్నారు. శాలిబండ ఆషా టాకీస్, లాల్‌దర్వాజా వెంకట్రావు స్కూల్ సమీపంలోని ప్రైవేటు గ్యాస్‌బంకుల వద్ద ఆటోలు బారులు తీరుతున్నాయి. బంక్‌కు ఇరువైపుల కిలో మీటరుకు పైగా దూరం క్యూ కడుతున్నాయి. ఆటో డ్రైవర్లు గ్యాస్ కోసం తిరుగుతూ ఎక్కడ గ్యాస్‌బంక్‌లు తెరచి ఉంటే అక్కడ బారులు తీరుతున్నారు. దీంతో రోడ్లపై ఆటోల సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. బంక్ నిర్వాహకులు మాత్రం యుద్ధం కారణంగా సరఫరాలో జాప్యం జరుగుతుందని, వాహనదారులు సహకరించాలని కోరుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేశారు.

వరుస సెలవులు, క్రెడిట్‌నోట్స్ లేవు...

గల్ఫ్ దేశాల నుండి గ్యాస్ సరఫరా సరిగా లేకపోవటం, డిమాండ్ ఎక్కువగా ఉండటం, మాసాంతం కావటం, టార్గెట్ పూర్తి చేసేందుకు గ్యాస్ కంపెనీలు పాత నిబంధనలను మార్చాయి. గతంలో అవసరమైన పెట్రోలు, గ్యాస్ కోసం డీలర్లు డీడీలు చెల్లిస్తే క్రమపద్ధతిలో వాటికి లోడ్లను సరఫరా చేసేవారు. వరుస సెలవుల సమయంలో క్రెడిట్‌నోట్స్ ఇచ్చేవారు. పెట్రోలు, గ్యాస్ సరఫరా చేసేవారు. బ్యాంకులు తెరచిన తరువాత ఆమొత్తానికి డీడీలు చెల్లించేవారు. ప్రస్తుతం మాసాంతం, వరుస సెలవులు, నెలవారి టార్గెట్ పూర్తి చేసేందుకు నిబంధనలను ఆయిల్ కంపెనీలు సడలించాయి. దీంతో మార్చిలో వచ్చిన వరుస సెలవులు, క్రెడిట్ నోట్స్‌ను గతంలో మాదిరి ఆయిల్ కంపెనీలు ప్రస్తుతం ఇవ్వటం లేదు. డీలర్లు లోడ్‌కు అయ్యే పూర్తి డబ్బులు డీడీ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. ఆ తరువాత బ్యాంకులో లావాదాలు పూర్తై ఆయిల్ కంపెనీలకు చేరుతుంది. అక్కడి అధికారులు వరుస క్రమంలో లోడ్లను పంపిస్తారు. తద్వారా బంక్‌లకు లోడ్లు రావటం ఆలస్యమైతుంది. వినియోగదారులను ఇబ్బంది పెట్టలేక డీలర్లు బంక్‌ల ముందు నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం తెలియని జనాలు పెట్రోలు, గ్యాస్ కొరత ఏర్పడిందని భయపడి బంక్‌ల వద్దకు పరుగులు తీస్తున్నారు.

ఎలాంటి సమస్యలేదు : సిపి

నగరంలో ఇంధనం, ఎల్‌పిజి సిలిండర్లకు ఎలాంటి కొరతలేదని, తగినన్ని నిలువలు అందుబాటులో ఉన్నాయని, నగరం అంతటా సరఫరా సజావుగా జరుగుతోందని, పౌరులు ఆందోళనకు గురి కావద్దని, ఇంధన కేంద్రాల వద్దకు తొందరపడవద్దని నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఇటువంటి చర్యలు అనవసరమైన రద్దీకి, అంతరాయానికి దారితీయవచ్చని సూచించారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఉండి సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 1నుంచి కొత్త నిబంధనలు

-పారిశుధ్య సేవల్లో పారదర్శకత, జవాబుతారీతనం ఉండాలి

-అధికారులకు సిఎంసి కమిషనర్ సృజన ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ జి.సృజన తదితరులు

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: వచ్చేనెల 1 నుంచి కొత్త మున్సిపల్ ఘన వ్యర్థాల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ-పారిశుధ్య కార్యకలాపాలపై నాక్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి అదనపు కమిషనర్లు, జెడ్‌సి,డిసిలు పారిశుధ్య, టౌన్ ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈసందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ పారిశుధ్య సేవలలో జవాబుదారీతనం, పారదర్శకత సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు.నగర పరిశుభ్రతను మెరుగుపరచడానికి అన్ని ప్రాంతాలలో వంద శాతం చెత్తను సేకరించాలని మూలస్థానంలోనే చెత్తను వేరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, చెత్త వర్గీకరణ నిబంధనలను పాటించడం, భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లర్లు ఈనిబంధనలను వందశాతం పాటించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అలాగే వార్డుల వారీగా రూట్ ప్లాన్‌లు, పారిశుధ్య మోలిక సదుపాయాల సమగ్ర మ్యాపింగ్‌ను సిద్ధం చేయాలన్నారు.పర్యావరణ హితం కోసం చెత్త సేకరణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, నిబంధనల ప్రకారం సొంతంగా వ్యర్థాల ప్రాసెసింగ్ చేసేలా నియంత్రించాలన్నారు. కొత్త ఎంఎస్‌డబ్లూ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, సిబ్బంది, వ్యవస్థలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు. అధికారికంగా అనుమతి పొందిన వ్యక్తులు, ఏజెన్సీలు మాత్రమే చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ గారు స్పష్టం చేశారు.

నాచారం చెరువు అభివృద్ధికి సన్నాహాలు : హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మార్చి 24,ప్రభాతవార్త: హైడ్రా రెండో విడత చేపడుతున్న 14 చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. మంగళవారం ఉప్పల్ మండలంలోని నాచారంలోని పెద్ద చెరువును పరిశీలించారు. మొత్తం 108.30 ఎకరాలున్న నాచారం చెరువులో 81.12 ఎకరాలమేర నీటి జాడ కనిపించకుండా కమ్మేసిన గుర్రపు డెక్కను గమనించారు. వెంటనే చెరువులోని మురికి నీటిని కిందకు వదిలేసి పూడికను పూర్తిగా తొలగించాలని ఆచెరువు పనులు పర్యవేక్షిస్తున్న అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. స్థానికులు పెద్దయెత్తున హైడ్రా కమిషనర్ నుకలిసి నాచారం చెరువు పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మురుగునీరు కలవడంతో చెరువంతా గుర్రపుడెక్క వ్యాపించి దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అంబర్‌పేట లోని బతుకమ్మ కుంటలా, పాతబస్తీలోని బమ్మక్‌నుద్దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు మాదరి అభివృద్ధి చేసి ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇక్కడ గతంలో ఎస్‌టీపీ పెట్టినా ప్రయోజనం లేకపోయిందని.. నేరుగా మురుగు నీరు కలిసిపోతోందని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ చెరువు నీరు వదిలితే నేరుగా ఉప్పల్ నల్లచెరువులోకలుస్తున్నదని.. దీంతో ఆ చెరువు అభివృద్ధి పనులు ఆలస్యమయ్యే ప్రమాదముందని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఉప్పల్ నల్లచెరువు వద్ద కాలువను డైవర్ట్ చేసి వెంటనే ఈ చెరువు అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని కోరారు.

చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తదితరులు

మీర్జాల్‌గూడలో వరద ముప్పుపై అధ్యయనం

మల్కాజిగిరి పరిధిలోని మీర్జాల్‌గూడ చిన్మయిమార్గ్ ప్రాంతాలను రంగనాథ్ పరిశీలించారు. వర్షాకాలంలో ఎగువ నుంచి భారీ మొత్తంలో వచ్చిన వరదతో తమ ప్రాంతాలన్నీనీట మునుగుతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఉన్న అవకాశాలను ఇరువురు అధికారులు క్షేత స్థాయిలో సమీక్షించారు. పైనుంచి వచ్చే వరద సాఫీగా వెళ్లేందుకు అవ కాశం లేకుండా కాలువలు కుంచించుకుపోయినట్టు గుర్తించారు. మహేంద్రహిల్స్ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తోందని.. ఇక్కడ కేవలం ఒక మీటరు వెడల్పుతో నాలా ఉండడంతో సరిపోవడంలేదని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఉన్న అండర్ డ్రైనేజీ కాలువను విస్తరించాలా.. సమాంతరంగా మరో కాలువను నిర్మించాలా అనే విషయాలను పరిశీలించాలని అధికారులకు హైడ్రా కమిషనర్ సూచించారు. కాలువల విస్తరణ పనులను చేపడతామని.. అందరూ సహకరించాలని స్థానికులను హైడ్రా కమిషనర్ కోరారు. పనులు జాప్యం కాకుండా చూడాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

-మ్యూజియంలోని నలభై గ్యాలరీలలో అద్భుతమైన కళాఖండాలు -సందర్శకులతో కళకళలాడుతున్న సాలార్‌జంగ్ మ్యూజియం

సాలార్‌జంగ్ మ్యూజియం

పాల రాతి రెబెక్కా విగ్రహం

గంటలు కొట్టె గడియారం

చార్మినార్,మార్చి 24 ప్రభాతవార్త : ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండాలకు నిలయంగా ఎంతగానో ప్రసిద్ధి గాంచిన సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఏప్రిల్ నెలలో అత్యంత వైభవంగా నిర్వహించటానికి మ్యూజియం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.సాలార్‌జంగ్ మ్యూజియం ఏర్పడి ఈ సంవత్సరం డిసెంబరు నెల 16వ తేదీ నాటికి 75 సంవత్సరాలు పూర్తి కానున్నాయి.ఈ నేపథ్యంలోనే వచ్చే నెలలో జరపనున్న ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.రాష్ట్ర గవర్నర్,సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు చైర్మన్ శివ ప్రతాప్ శుక్లా మ్యూజియం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలలో పాల్గొననున్నారని మ్యూజియం కీపర్ డాక్టర్ ఆర్.బి.నాయక్ తెలిపారు.హైదరాబాద్ పాతబస్తీ నయాపూల్ మూసీనది ఒడ్డున ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీ రోజు పర్యాటకులతో కళకళ లాడుతుంటుంది. మొదటి,రెండవ సాలార్‌జంగ్‌లతో పాటు మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీఖాన్ బహదూర్‌లు కలిసి మన దేశంతో పాటు ప్రపంచంలోని పలు దేశాలు నుంచి అరుదైన ఎంతో అద్భుతమైన సుమారు 45 వేల కళాఖండాలను సేకరించారు.ముగ్గురు సాలార్‌జంగ్‌లు సేకరించిన అద్భుతమైన కళాఖండాలను మదీనా సమీపంలోని దివాన్‌దేవిడిలో ఏర్పాటు చేశారు.భారత దేశ ప్రధమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1951వ సంవత్సరం డిసెంబరు నెల 16వ తేదీన దివాన్ దేవిడిలో సాలార్‌జంగ్ మ్యూజియంను ప్రారంభించారు.నయాపూల్ మూసీనది ఒడ్డున నిర్మించిన సాలార్‌జంగ్ మ్యూజియం నూతన భవనంలోకి 1968లో దివాన్‌దేవిడి నుంచి అక్కడకు మ్యూజియంను తరలించారు. సాలార్‌జంగ్ మ్యూజియంలోని గ్యాలరీలలో సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇటలీ శిల్ప కళానైపుణ్యంతో రూపొందించిన రెబెకా ౘ పాలరాతి ముసుగు సుందరి విగ్రహం,ప్రతీ గంటకు గంటలు కొట్టె మ్యూజికల్ గడియారం,డల్ స్టాచ్యు విగ్రహాలను తిలకించే సందర్శకులు ఎంతో అనుభూతికి లోనవుతుంటారు.ఆధునిక కళ,పెయింట్ వస్త్రాలు, క్యాంచ విగ్రహాలు,దంతపు శిల్పాలు,ఎంబ్రాయిడరీ,కలప,వాటర్ కలర్ చిత్రాలు,చిన్న పిల్లలు గ్యాలరీలు,చైనా,జపానీస్,యురోపియన్ గ్యాలరీలో పాటు 40 గ్యాలరీలలో సుందరమైన 16 వేల కళాఖండాలు ఉన్నాయి.సాలార్‌జంగ్ మ్యూజిమంలోని కళాఖండాలను తిలకించి పర్యాటకులు ఎంతో అనుభూతికి లోనవుతుంటారు.సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీ రోజు ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు తెరచి ఉంటుంది.పెద్దలకు 100 రూపాయలు,చిన్న పిల్లలకు 20 రూపాయలు,విదేశీయులకు 1000 రూపాయలు ప్రవేశ టిక్కెట్ వసూళ్లు చేస్తున్నారు .ప్రభు త్వ పాఠశాలకు చెందిన బాల బాలికలకు ఉచిత ప్రవేశం.శుక్రవారం సాలార్‌జంగ్ మ్యూజియంకు సెలవు.

మాజీ డీజీపీ హెచ్‌జే దొరకు నివాళులు

జూబ్లీహిల్స్, మార్చి 24, ప్రభాతవార్త:
మాజీ డీజీపీ హెచ్‌జే దొరకు మంగళవారం పలువురు పోలీసు ఉన్న తాధికారులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్‌జే దొర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని దసప ల్లా హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి మాజీ డీజీపీ,తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మో హన్‌రావు, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్, డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌లతో పాటు పలువురు ప్రస్తు త, విశ్రాంత అధికారులు విచ్చేశారు. ఈ సందర్భంగా దొరతో తమక న్న అనుబంధాన్ని వారు పంచుకున్నారు. డీజీపీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పోలీసు శాఖలో ఆయన చేసిన సేవల ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో దొర కుమార్తె డాక్టర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొర చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులను విడుదల చేయాలని బిఆర్ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది బిఆర్ఎస్‌వి విద్యార్థులు మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యమాలను అణిచివేయాలని ప్రభుత్వం చూడటం దుర్మార్గమైన చర్యని, ఇది ప్రజాస్వామ్యం అనిపించుకోదని, రాజ్యాంగ హక్కులను హరించడమేనని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమ స్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని సూచించారు.సమస్యలు పరిష్కారించేంతవరకు ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామన్నారు.

నగరంలో వర్షం..పలుచోట్ల వడగళ్లు

-రోడ్లపై నిలిచిన నీరు..వాహనదారులకు తిప్పలు

హైదరాబాద్, మార్చి 24,ప్రభాతవార్త:
నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. హైదర్‌గూడా పరిసర ప్రాంతాల్లో వడగళ్ల వాన పడింది. ఒక్కసారిగా కురిసిన వానతో వాహనదారులు తడిసి ముద్దయ్యారు. ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి పనులు ముగించుకొని ఇంటికె వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్ బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్ లో తదితర ప్రాంతాల్లో రహదారులపైకి నీరు చేరింది. కొద్దిపాటి వర్షానికే నిజాంపేట్ రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై వాన నీరుతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా కురిసిన వానతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. వేసవిలో ఉక్కపోతతో అల్లాడుతున్న నగర వాసులు కాస్త ఉపశమనం పొందారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయడంతోపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని తెలిపింది. రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి నుంచి ఒకటి నుంచి రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి నాలుగు రోజులలో క్రమేపీ రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

భవన నిర్మాణాల అనుమతుల్లో పారదర్శకత పాటించాలి

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త : మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసి) ప్రధాన కార్యాలయంలోకమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బిల్డ్ నౌ అప్లికేషన్‌లో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతులను సర్కిల్ వారిగా, జోన్ వారిగా సమీక్షించారు. అదే విధంగా ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ వివరాలను కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. అనవసరంగా షార్ట్ ఫాల్ రాసి దరఖాస్తులను తిప్పి పంపవద్దని, షార్ట్ ఫాల్స్ ఉంటే అన్ని ఒకేసారి తెలియజేయాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే ముందు డీవియేషన్ లేకుండా నిర్ధారణ చేసి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాలని తెలిపారు. అన్ని సక్రమంగా ఉన్న ఉన్న దరఖాస్తులకు వెంటనే అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. సర్కిల్ లెవెల్‌లో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులందరికీ భవన నిర్మాణ కూల్చివేతల వ్యర్థాలు నిర్మాణదారులు ఎక్కడ వేస్తున్నారో తెలుసుకొని, బహిరంగ ప్రదేశాలలో వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలలో, మెయిన్ రోడ్ల మీద ఆక్రమణలు లేకుండా చూడాలని తెలిపారు. నాళాల మీద ఉన్న తాత్కాలిక ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నాళాల మీద ఉన్న ఆక్రమణలను తొలగించడం ద్వారా, నాళాల పూడిక తీయడానికి సులభం అవుతుందని తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించి పిర్యాదులు అందిన వెంటనే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంటెంప్ట్ కేసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, జోనల్ సిటీ ప్లానర్‌లు, అడిషనల్ సిటీ ప్లానర్‌లు, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి. చిత్రంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్

గుంతలు లేని కార్పొరేషన్‌గా మల్కాజిగిరి: వినయ్‌కృష్ణారెడ్డి

మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఇంజనీరింగ్ నిర్వహణ,ప్రాజెక్టులు, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.మొదట ఇంజనీరింగ్ నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ సీసీ, బీటి గుంతలు లేకుండా చేయాలని ఆదేశించారు. గుంతలు లేని కార్పొరేషన్‌గా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ను తీర్చిదిద్దడం లక్ష్యంగా చేసుకొని పని చేయాలని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 528 పనులు అనుమతులు పొందినవి. అందులో 11 పనులు పూర్తి కాగా,111 పనులు 50 శాతానికి పైగా పూర్తి అయ్యాయని తెలిపారు.మిగతా 67 పనులు 25 నుండి 50వరకు పూర్తి కాగా, 339 పనులు 25 శాతం కన్నా తక్కువ పూర్తి అయ్యాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. వీధి దీపాల మరమ్మత్తులకు సంబంధించిన అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కొత్త వీధి దీపాలు అవసరమైన చోట కొత్తవి, మరమ్మత్తులు అవసరమైన చోట మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని తెలిపారు. ఏవైనా పిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంఎంసి చీఫ్ ఇంజనీర్ అశోకెరెడ్డి, సూపరింటెండ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

డా.బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో మాక్ అసెంబ్లీ

బాగ్ లింగంపల్లి డా.బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో మాక్ అసెంబ్లీని నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి మార్చి 24, ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లి డా.బి.ఆర్. అంబేద్కర్ కళాశాల సోషల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మాక్ అసెంబ్లీ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ప్రజాప్రతినిధుల పాత్రల్లో ఒదిగిపోయి, అసెంబ్లీ కార్యకలాపాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ సామాజిక చైతన్యం, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ప్రభుత్వాల పరిపాలనా విధానాన్ని విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహనను పెంచుతాయని పేర్కొన్నారు. ప్రధానంగా సభలో విద్యార్థులు వివిధ ప్రజా సమస్యలపై చర్చించడం, బిల్లులను ప్రవేశపెట్టడం వంటి అంశాలు తిలకించిన వారిని ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ విద్యార్థుల ప్రదర్శనా శైలిని అభినందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు పత్రాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు డా.శ్రీధర్, ఎం.శ్రీనిక్, డా.కృష్ణ ప్రసాద్, డా.మధుకర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు తగు సూచనలు అందించి కార్యక్రమ విజయానికి సహకరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 33.56 లక్షలు

చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మార్చి 24, ప్రభాతవార్త: చిక్కడపల్లి లోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని మంగళవారం అధికారులు లెక్కించారు. గత ఏడాది నవంబర్ 25 నుండి ఇప్పటి వరకు (మొత్తం 119 రోజులకు గాను) భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి. శ్రీనాథ్ గౌడ్, సహాయ కమిషనర్ కే రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. నగదు రూపంలో: రూ. 31 లక్షల 30 వేల 297 రాగా, చిల్లర నాణేలు రూ. 2 లక్షల 26 వేల 034 కలిపి మొత్తం ఆదాయం రూ. 33 లక్షల 56 వేల 331 నగదు తో పాటు భక్తులు విదేశీ కరెన్సీని కూడా మొక్కుబడిగా చెల్లించారు. ఇందులో అమెరికన్ డాలర్లు (358), యూఏఈ దిర్హామ్స్ (5) దక్షిణాఫ్రికా ఆఫ్రికా కరెన్సీ (20) ఉన్నాయని అధికారులు వెల్లడించారు. జి. సువర్ణలత, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. సురేఖ, ఆలయ సిబ్బంది, భక్తులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (చిక్కడపల్లి బ్రాంచ్) అధికారులు పాల్గొన్నారు.

జాగరణలో పాల్గొన్న ఉద్యమ నేత ఆర్వీ

జాగరణ పూజలో పాల్గొన్న ఆర్వీని సన్మానించిన నిర్వాహకులు

బేగంబజార్, మార్చి 24ప్రభాతవార్త: శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళ్‌హాట్ డివిజన్‌లో నిర్వహించిన మాతా జాగరణ పూజలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్‌కుమార్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం కోసం ప్రతి ఒకరు పాటు పడాలన్నారు.ఈ కార్యక్రమంలో రూపేష్, హరి, మల్లేష్ ముదిరాజ్, బి.రాజేందర్, బాకేష్‌సింగ్, గోపాల్‌సింగ్, సంజయ్‌సింగ్ తదితరులుపాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్ యాదవ్ నియామకం

గోషామహల్, మార్చి 24ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్‌యాదవ్‌ను నియమించారు.ఈ మేరకుటిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులైన చంద్రమోహన్‌యాదవ్‌నుఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని,తనకు అప్పగించిన బాధ్యతలను అందరి సహకారంతో ముందుకు వెళ్తన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోత రోహిత్‌ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రోజూ వాల్ టూ వాల్ స్వీపింగ్ జరగాలి : జెడ్సీ

పూల్‌బాగ్ వద్ద అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న రాజేంద్రనగర్ జెడ్సీ మంద మకరంద్

చాంద్రాయణగుట్ట, మార్చి 24, ప్రభాతవార్త : ప్రతి రోజు వాల్ టూ వాల్ స్వీపింగ్ జరగాలని జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరంద్ స్పష్టం చేశారు. జంగమ్మెట్ సర్కిల్ పరిధిలోని డీఆర్‌డీఎల్, బాబానగర్, గుల్షన్ ఎక్బాల్ కాలనీ తదితర ప్రాంతాలు, ప్రధాన రోడ్డు మార్గంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వాహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని, వ్యాపారులు తమ దుకాణాల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసుకునేలా వారిని చైతన్యపరచాలని ఆదేశించారు. ఆయా దుకాణాల నుండి వచ్చే వ్యర్థాలను డస్ట్‌బిన్లలో మాత్రమే వేసేలా అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై చెత్తచెదారం, మట్టి దిబ్బలు, చెత్తకుండీలలోని వ్యర్థాలను నిత్యం తొలగించి పరిశుభ్రతను పరిరక్షించాలని సూచించారు. జెడ్సీ వెంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ.నాగమణి, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈ సన్నీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ హమీద్ తదితరులున్నారు.

ఈ పెట్టీ కేసులో నలుగురికి జైలు

చాంద్రాయణగుట్ట, మార్చి 24, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన ఒక ఈ పెట్టీ కేసులో నలుగురు వ్యక్తులకు కోర్టు నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి కథనం ప్రకారం...పూల్‌బాగ్ నివాసి, ప్రైవేటు ఉద్యోగి షేక్ హాషిమ్ అలీ (23), జీ.ఎం.చౌనీ నివాసి, ప్రైవేటు ఉద్యోగి షేక్ తాజుద్దీన్ (19), పూల్‌బాగ్ నివాసి, విద్యార్థి షేక్ రెహమాన్ (18), ఉప్పుగూడ నివాసి, ప్రైవేటు ఉద్యోగి జి.సాయి కిరణ్ (19)లు అనుమానస్పదంగా సంచరిస్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని విచారించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. నల్గురిపై ఈ పెట్టీ కేసు నమోదు చేసి నాంపల్లిలోని 9వ ఎస్.ఎం.ఎం. కోర్టు ముందు హాజరు పరిచారు. కేసు విచారించిన కోర్టు నల్గురు వ్యక్తులకు నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధిం చింది. వారిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.కేసు దర్యాప్తులో ఉంది.

అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కరాటే శిక్షణా కేంద్రంను తక్షణమే మూసివేయాలి

-సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు
-ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు
హైడ్రా ఎసిపి తిరుమల్

ఇందిరాపార్కులో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కరాటే శిక్షణ కేంద్రంను సందర్శించిన సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ మంగతాయారు

ముషీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: ఇందిరాపార్కులో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కరాటే శిక్షణా కేంద్రంను తక్షణమే మూసివేయాలని సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ మంగతాయారు ఆదేశించారు. మంగళవారం ఇందిరాపార్కులో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కరాటే శిక్షణ కేంద్రంను ఆమె కవాడిగూడ డిప్యూటి మున్సిపల్ కమీషనర్ ఆర్.పుష్పలత, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఇందిరాపార్కు డిప్యూటి డైరెక్టర్ చంద్రశేఖర్ మరియు వివిధ అధికారులతో కలసి సందర్శించారు. ఇందిరాపార్కులోని పార్కింగ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో, జీహెచ్ఎంసీకి ఎటువంటి రుసుము చెల్లించకుండా అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తి కరాటే కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని, ప్రభుత్వ స్థలం కబ్జాకాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పార్కులో స్కేటింగ్, షటిల్ కోర్టు నిర్వహిస్తున్న వారు జీహెచ్ఎంసీకి ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తున్నారని, కరాటే నిర్వాహకులు ఏమైనా పేమెంట్ చేస్తున్నారా అని ఆమె జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. కరాటే నిర్వాహకులు ఎటువంటి రుసుము చెల్లించకుండా వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారని శ్రీనివాస్ తెలపటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎటువంటి రుసుము చెల్లించకుండా, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కరాటే శిక్షణా శిబిరాన్ని మూసివేయాలని ఆదేశించారు. ఇందిరాపార్కులో నిర్వహిస్తున్న నిర్మాణాలను హైడ్రా ఏసీపీ తిరుమల్, ఎస్ఐ నర్సింగరావు, హైడ్రా సిబ్బంది పరిశీలించారు. కరాటే కోచింగ్ సెంటర్‌లో నిర్మాణానికి తీసుకువచ్చిన సామగ్రిని తక్షణమే తొలగించాలని, లేనిపక్షం ఆ సామగ్రిని తామే సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పార్కులో అనుమతి లేని కరాటే కోచింగ్ సెంటర్‌కు మద్దతు ఇస్తున్న స్థానిక నేతలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. పార్కులో జరుగుతున్న కరాటే శిబిరం, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను సీపీఎం నేతలు హైడ్రా ఏసీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.దశరథ్, ఆర్.వెంకటేష్, పి.విమల పాల్గొన్నారు.

పూజల కంటే ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

సుబ్రహ్మణ్య శతకం గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి మార్చి 24 (ప్రభాతవార్త) : కోరికలతో చేసే పూజల కంటే నిత్యం ధ్యానం చేయడం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని నేటి నిజం పత్రిక ఎడిటర్ బైస దేవదాసు పేర్కొన్నారు. మంగళవారం 'సాహితీ కౌముద్ది సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ రచించిన 'సుబ్రహ్మణ్య శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా దేవదాసు హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. శంకర నారాయణ ఏ సాహిత్య ప్రక్రియలోనైనా తనదైన ప్రతిభను చాటుకోగల దిట్ట అని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన 'సాహితీ కిరణం' ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. వాగ్గేయకారులు కీర్తనల ద్వారా భగవంతుడిని ఆరాధిస్తే, కవులు శతక పద్యాల ద్వారా స్తుతిస్తారని తెలిపారు. శంకర నారాయణ పద్య రచనలో అపారమైన ప్రజ్ఞ కలవారని ప్రశంసించారు. అనంతరం ఈ శతక పద్య సంపుటిని సాహిత్య అభిమాని కోసి రాఘవరెడ్డికి అంకితం ఇచ్చారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ రచయిత శంకర నారాయణ తన రచనను తనకు అంకితం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇదే వేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు అందుకున్న అనంత పద్మనాభ రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు జూబ్లీ విద్యాధరరావు, సంస్థ స్థాపక కార్యదర్శి పెద్యారి వెంకట దాసు తదితరులు పాల్గొని నివేదికలు సమర్పించారు.

శ్రీరామనవమి పండుగ ఏర్పాట్లపై నిర్వాహకులతో పోలీసుల సమావేశం

సమావేశంలో పాల్గొన్న ఎస్ఆర్‌నగర్ ఏసిపి రాఘవేంద్రరావు, బోరబండ సిఐ సురేందర్.

యూసుఫ్‌గూడ, మార్చి 24, ప్రభాతవార్త : పండుగ పర్వదినాలను శాంతి యుతంగా జరుపుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎస్ఆర్‌నగర్ ఏసిపి రాఘవేంద్ర రావు అన్నారు. మంగళవారం బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైట్ 3లో కాలనీలో శ్రీ సీతారామాంజనేయ శివాలయం ప్రాంగణంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ అధికారులు నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసిపి మాట్లాడుతూ పండుగ సమయంలో చేపట్టాల్సిన భద్రత చర్యలు ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపుల మార్గాలు, శబ్ద నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. పోలీసు అధికారులు నిర్వాహకులకు మార్గదర్శకాలు ఇచ్చి సహకరించాలని సూచించారు. పండుగను శాంతి యుతంగా జరుపుకునేందుకు అందరు కలిసి పనిచేయాలని అధికారులు కోరారు. ఈకార్యక్రమంలో బోరబండ సిఐ సురేందర్ గౌడ్ ఎస్సైలు నాగుల్ మీరా,మధుసూధన్, కాశయ్య, ఆలయ కమిటి అధ్యక్షులు బి మల్లయ్య గౌడ్, ఉపాధ్యక్షులు సునీల్, సత్యనారాయణ, సెక్రటరీ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిక్కా మురళీ, కోశాది కారి శ్రీనువాసరావు, రామ్మోహన్‌రావు, సప్తాజి, సాయినాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్మాయిల్‌నగర్‌లోని వస్త్ర, ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

తగలబడుతున్న ప్లాస్టిక్, వస్త్రాల తుక్కు

చాంద్రాయణగుట్ట, మార్చి 24, ప్రభాతవార్త : తాళం వేసి ఉన్న వస్త్ర, ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ గోదాములో కరెంటు కూడా లేకపోవటంపై అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ కథనం ప్రకారం.... పాతబస్తీ బండ్లగూడ ఇస్మాయిల్‌నగర్‌లో తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన రషీద్ వస్త్ర, ప్లాస్టిక్ గోదామును నిర్వహిస్తున్నాడు. గోదాము జనవాసాల మధ్య ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం ఉన్నఫళంగా గోదాము నుండి దట్టమైన పొగలు, మంటలు రావటం గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఈలోగ స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమీప ఇళ్ళలో నివసించేవారు ఆందోళనకు గురైయ్యారు. ఇళ్ల విడిచి బయటకు పరుగులు తీశారు. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. చాంద్రాయణగుట్ట అగ్నిమాపక సిబ్బందితో కలిసి దాదాపు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అయితే గోదామును ఆనుకొని ఉన్న ఇళ్లు మంటల వేడికి బీటలు పారాయి. ఇళ్ళలోని ప్లాస్టిక్ వస్తువులు పనికి రాకుండా పోయాయి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా రషీద్ గోదామును నిర్వహిస్తున్నట్లు స్థానికలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 15 లక్షల రూపాయల వరకు ఆస్థినష్టం జరిగినట్లు నిర్వాహకుడు రషీద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నయనమనోహరం నమ్రత కూచిపూడి నృత్యం

నమ్రత కూచిపూడి నృత్యనివేదనలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, మార్చి 24 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్రీసాయి నటరాజ కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో ప్రఖ్యాత నాట్యగురువు కళారత్న డా. పి.రమాదేవి శిష్యురాలు నమ్రత కూచిపూడి నృత్యనివేదనం నయనమనోహరంగా సాగి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. నమ్రత తన నృత్యనివేదనం ముందుగా సారంగరాగం రూపకతాళంలో ముత్తుస్వామి దీక్షితుల కీర్తన అరుణాచల నాథస్మరామితో ప్రారంభించి వందే వందే వాణిభవాని, క్షేత్రయ్యపాదం ఇంత మోహమేమిరా, త్యాగరాజుల పంచరత్న కీర్తన కనకన రుచిరా, గొల్లకలాపం ప్రవేశదరువు, జయదేవ అష్టపది ధీరసమేరా యమునాతీరే, చివరిగా సారంగరాగం ఆదితాళంలో బాలమురళీకృష్ణ తిల్లానా అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఆహుతులను తన్మయుల్ని చేసింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు కళాకారిణి నమ్రతను, నాట్య గురువు డా. పి.రమాదేవిని ఘనంగా సత్కరించి వారి కళాసేవను కొనియాడారు.

గాయత్రినగర్‌లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

గాయత్రినగర్‌లో నివాసాల మధ్య పేరుకుపోయిన మురుగునీరు.

యూసుఫ్‌గూడ, మార్చి 24, ప్రభాతవార్త : గాయత్రి నగర్ కాలనీలో గత కొద్ది రోజులుగా రైల్వేట్రాక్ ప్రాంతంలో ఇతర కాలనీలకు చెందిన డ్రైనేజి మురుగు నీరు చేరడంతో స్థానికంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురువతున్నారు. వివేకానందనగర్ కాలనీ నుంచి వచ్చే డ్రైనేజి మురుగు నీరు గతంలో రైల్వే బ్రిడ్జ్ కింద అండర్ పాస్ నుంచి మురుగు నీరు వెళ్ళేవి. అయితే గత కొన్ని రోజులుగా ఆ అండర్ పాస్‌ను శుభ్రపరచకపోవడంతో అక్కడ చెత్త వ్యర్థాలు చేరడంతో మురుగునీరంతా అటు వెళ్ళకుండా గాయత్రినగర్ కాలనీ వైపు రావడంతో నీరంతా అక్కడ నిలబడిపోయి దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. అంతేకాకుండా చుట్టుప్రక్కల ఇళ్ల లోని బోర్లల్లో మురుగు నీరు వస్తుండటంతో స్థానికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యను సంబందిత జలమండలి అధికారులు తగిన విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయగలిగితే తమకు ఈ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందని స్థానికులు కోరుతున్నారు.

సీతా రామ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మాజీసెట్విన్ డైరెక్టర్, కాంగ్రెస్ కార్యదర్శి ఎస్.ధన్‌రాజ్‌మాదిగ కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలంలో సీతారామచంద్రస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

బడ్జెట్ కేటాయింపుల్లో ముదిరాజ్‌లకు తీవ్ర అన్యాయం : శ్రీనివాస్ ముదిరాజ్

సమావేశంలో మాట్లాడుతున్న గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, పొల్కం లక్ష్మీనారాయణ, రమణ, నీరజ తదితరులు

హైదరాబాద్, మార్చి 24,ప్రభాతవార్త: ముదిరాజ్‌లకు బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ముదిరాజ్ జేఏసి కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుండ్ల పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్లకు ప్రభుత్వం సముచితస్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కుబడిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కేవలం రూ.50 కోట్ల నిధులు కేటాయించారని, ఖర్చు చేసింది మాత్రం అంతంత మాత్రమేనన్నారు. కేవలం 1.1 శాతం కేటాయిఅంచి చేతులు దులుపుకున్నారన్నారని మండిపడ్డారు. ఉచిత చేప పిల్లలు, రొయ్యల పంపిణీకి కనీసం వంద నుంచి 200 కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.18కోట్లు కేటాయించి అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకుటూ, ఫోర్ వీలర్లు ఇచ్చారని, ఇంటిగ్రేటెడ్ ఫిషరీస్ డెవలప్మెంట్ స్కీమ్ (ఐఎఫ్ఎస్) పథకం ద్వారా వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. కావున ఈ పథకం కింద కనీసం వెయ్యి కోట్లు మంజూరు చేసి అవి ముదిరాజ్లకే చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలకు మార్చాలన్న డిమాండ్‌ను వెంటనే నెరవేర్చాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసి రాష్ట్ర చైర్మన్ పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, మత్స్య విభాగం కన్వీనర్ లోకనబోయిన రమణ ముదిరాజ్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ ముదిరాజ్, మెదక్ జిల్లా నాయకులు బదెన లక్ష్మయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమిస్తాం

- మణికొండ బిఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

ప్రజల సమస్యలపై స్పందించకపోతే అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్న మణికొండ బిఆర్ఎస్ నాయకులు.

నార్సింగి, మార్చి 24 ప్రభాతవార్త : ప్రజల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజలందరితో కలిసి అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని, ఉద్యమిస్తామని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ హెచ్చరించారు. మంగళవారం శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ కార్యాలయానికి వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెమోరండంను అందజేశారు. అనంతరం సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ అంబేద్కర్ భవన్, బుల్కాపూర్ నాలా, వీధి వ్యాపారస్థుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, పందెన్ వాగు బాక్స్‌డ్రైన్ కట్టడం, టీం4బిల్డర్స్‌పై చర్య, ఇళ్ల మధ్యలో రెడిమిక్స్ సిమెంట్ ప్లాంట్లను ఎత్తివేయాలని, ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైన్‌షాపులు తొలగించాలని, సమీకృత సమగ్ర మార్కెట్ ఏర్పాటు వంటి అంశాలపై అనేక మార్లు సంబంధిత అధికారుల దృష్టికి మణికొండ బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులం తీసుకెళ్లామని, అధికారుల నుంచి ఆశించిన స్పందన రావడం లేదన్నారు. అధికారులలో చలనం రాకుంటే ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన తెలుపుతామని మెమోరండంలో పేర్కొనడం జరిగిందన్నారు. నెమలీనగర్ పార్కు, బాలాజీనగర్‌లోని పివి నర్సిహ్మారావ్ పార్కుల అభివృద్ధిపై బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అమృతను కలిసి చర్చించామని సీతారాం ధూళిపాళ వివరించారు. మెమోరండం అందజేసిన వారిలో బిఆర్ఎస్ నాయకులు కుంభగల్ల ధన్‌రాజ్, గుట్టమీది నరేందర్, బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, నూకల మంజు,దేవిప్రియ పాల్గొన్నారు.

వేధింపులు, మోసాలు, కల్తీ ఆహారం తయారీపై కేసులు నమోదు

జూబ్లీహిల్స్, మార్చి 24, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ సంఘటనలపై కేసులు నమోదయ్యాయి.మహిళలపై వేధింపులు, మోసాలు, కల్తీ ఆహారం తయారీ,నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు వంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి.

భర్త బెదిరింపులు - కేసు నమోదు

ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విజయకుమారి (31) ఫిర్యాదు మేరకు ఆమె భర్త హరిపై కేసు నమోదైంది. గతంలో ఉన్న కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేస్తూ, ఆమె పనిచేస్తున్న మాధాపూర్‌లోని పబ్ వద్దకు వచ్చి బెదిరిస్తున్నట్లు ఆరోపించింది. ఈ కేసును పరిధి ప్రకారం మాదాపూర్ పోలీసులకు బదిలీ చేశారు.

కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ బట్టబయలు

ఫిల్మ్‌నగర్‌లోని స్వామి వివేకానంద నగర్ ప్రాంతంలో కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. చంద్ర శేఖర్, హరీష్ రెడ్డి, అఫ్జల్ సహ నిందితులను అదుపులోకి తీసుకుని, సుమారు రూ.15,000 విలువైన సరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్ - డ్రైవర్‌కు గాయాలు

జూబ్లీహిల్స్ రోడ్ నెం.78 వద్ద నిర్మాణ పనుల సమయంలో నిర్లక్ష్యం కారణంగా ఒక డ్రైవర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. వెంకట్ రెడ్డి సూచనల మేరకు ఇనుప రాడ్లు పడేస్తుండగా, అవి లైవ్ వైర్లకు తాకి ప్రమాదం జరిగింది. బాధితుడు మంగ్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మాజీ ప్రియుడి వేధింపులు, బ్లాక్‌మెయిల్

జూబ్లీహిల్స్‌కు చెందిన ఒక ఫ్యాషన్ డిజైనర్ ఫిర్యాదు మేరకు, అమెరికాలో ఉన్న ఆమె మాజీ ప్రియుడు ఫణి కిరణ్‌పై కేసు నమోదైంది. సోషల్ మీడియా అకౌంట్లు హ్యాక్ చేయడం, ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించడం, వ్యక్తిగత ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధిత యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో ఎం.వి. రమణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కారు లోపల బలవంతంగా అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది.

కెనడా వీసా పేరుతో రూ.1.5 లక్షల మోసం

బంజారాహిల్స్‌లోని ఓ ఇమ్మిగ్రేషన్ కంపెనీ కెనడా పీఆర్ వీసా పేరుతో రూ.1.5 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు ఫి ర్యాదు నమోదైంది. డబ్బు తిరిగి ఇవ్వకుండా మరిన్ని చెల్లింపు లు కోరినట్లు బాధితుడు తెలిపారు. కంపెనీ ప్రతినిధులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన

అత్తాపూర్ మార్చి 24, ప్రభాతవార్త : పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు.మంగళవారం డిసి సమ్మయ్య ఆధ్వర్యంలో అత్తాపూర్ గ్రేవ్‌యార్డ్,మల్లయ్య టవర్స్,హైదర్‌గూడ ఎర్రబోడ మెయిన్ రోడ్డు,సులేమాన్ నగర్ పిల్లర్ నెంబ 207 ,శాస్త్రీపురం హెచ్‌కేజిఎన్ ఫర్నిచర్ రోడ్డు,కాటేదాన్ మైహిఫీల్ పాయింట్,మైలార్‌దేవ్‌పల్లి రామకృష్ణ జంక్షన్ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలిలు నిర్వహించి అవగాహన కల్పించారు.అనంతరం డిసి మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ఇంటిలోని రోజువారి చెత్తను తప్పనిసరిగా ఎస్ఎటి ఆటోలకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డై ఈఈ ఎస్‌డబ్ల్యుఎం,తిరుపతి,ఎఈ ఆవిష్,ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి : గోదా వెంకటేష్ గౌడ్

హీరానగర్‌లోని విద్యుత్ సమస్యలను అధికారులకు వివరిస్తున్న గోదా వెంకటేష్ గౌడ్.

మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త : కార్వాన్ డివిజన్ హీరో నగర్ లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకులు, గుడిమల్కాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోదా వెంకటేష్ గౌడ్ విద్యుత్ అధికారులను కోరారు. హీరా నగర్ లో నిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంగళవారం ప్రజా పాలనలో భాగంగా హీరా నగర్‌లో పర్యటించిన విద్యుత్ అధికారులకు ఆయన ప్రజా సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా గోదా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ...హీరానగర్ రామాలయం వద్ద ఉన్నటువంటి విద్యుత్ స్తంభంతో స్థానిక కాలనీవాసులకు, వాహనదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దానిని వెంటనే తొలగించాలన్నారు. అదేవిధంగా లో వెల్టజీ సమస్యతో కాలనీ ప్రజలు బందులు ఎదుర్కోవడంతో పాటు గృహ ఉపకరణమైన వస్తువులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హీరానగర్ లో ఉన్నటువంటి నాలా వద్ద విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మెహదీపట్నం డివిజన్ ఏ.డి నాయక్, ఏ.ఈ కాత్రా, కాలనీవాసులు కటిక రాజు, చాకలి నరసింహ, పోచి, సురేష్‌లు ఉన్నారు.

బాగ్ లింగంపల్లి సాయిబాబా ఆలయంలో వైభవంగా సీతారాముల కల్యాణం

చిక్కడపల్లి మార్చి 24 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లిలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న (శుక్రవారం) సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు పేదోళ్ల గంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజ్ గౌడ్ ఉత్సవ వివరాలను వెల్లడించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపిస్తామన్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి బాగ్ లింగంపల్లి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వివరించారు.

రంగస్థల కళాసేవకుడు ప్రభాకర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ యువపురస్కారం : రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు

నాంపల్లి, మార్చి 24 ప్రభాతవార్త : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా అందజేసే యువ పురస్కారం 2026 సంవత్సరానికిగాను ప్రముఖ రంగస్థల కళాసేవకుడు సింగపంగ ప్రభాకర్ రంగస్థల కళల అభివృద్ధికి అందిస్తున్న అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. మార్చి 26 మధ్యాహ్నం 3గంటలకు నాంపల్లిలోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథి ఆచార్య అరికపూడి రాము తదితరులతో కలిసి ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించి యువపురస్కారం, 5116 రూపాయల నగదు బహుమతి ప్రదానం చేస్తారని రిజిస్ట్రార్ వివరించారు. ఈ సందర్భంగా బాచి నాటక ప్రదర్శన ఉంటుందని రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు వెల్లడించారు.

నేడు ఎస్‌డి సిగ్నోడియా కళాశాల గ్రాడ్యుయేషన్ డే

చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త : అగర్వాల్ శిక్షా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న చార్‌కమాన్‌లోని ఎస్‌డి సిగ్నోడియా కళాశాల,రాధాక్రిష్ణ ఉమెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేను ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నామని ఎస్‌డి సిగ్నోడియా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.సిహెచ్ దాల్ పడాల్ తెలిపారు. చార్‌కమాన్‌లోని సెడ్‌మల్ హాల్‌లో బుధవారం ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని,డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.క్రిష్ణ చైతన్య విచ్చేయనున్నారని,అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియా,కార్యదర్శి సిఎ నవీన్ కుమార్,ఎస్‌డిఎస్ కళాశాల కరస్పాండెంట్ శివ శంకర్ అగర్వాల్ పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు.

నేరాల నియంత్రణకు సిసి కెమేరాలు ఉపయోగం : ఎమ్మెల్యే శ్రీగణేష్

మోండా డివిజన్‌లోని టీచర్స్ కాలనీలో సీసీకెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, మార్చి 24 ప్రభాతవార్త: నేరాలను నియంత్రించేందుకు సీసీకెమెరాల పాత్ర ఎంతో కీలకమని, అందు వల్ల ప్రతి కాలనీ, బస్తీ, పార్కులు, ప్రధాన రహదారుల్లో, ఇండ్లల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్ ఈస్ట్ మారేడ్‌పల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవి కెమరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు సామాజిక బాధ్యతతో సీసీ కెమరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలజడులు, దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు, నేరస్థలను గుర్తించడంలో సీసీ కెమరాలు ఎంతో ఉపయోకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సాయి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సుకుమార్, కోశాధికారి సుధీర్, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిరబోయిన వైష్ణవి యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవుడు

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: దేశంలో అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా అవతరించిన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరుతూ మార్కెట్ చైర్మన్ ఆర్. ఆనంద్ బాబుగౌడ్, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు మంగళవారం వ్యవసాయ, మార్కెట్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావ్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారం, కుళ్లిపోయిన కూరగాయలను తొలగించేందుకు కంటోన్మెంట్ బోర్డు పారిశుధ్య సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో తమ సొంత నిధులతో చెత్తా, చెదారాన్ని తొలగించడం జరిగిందని ఆయన దృష్టికి తెచ్చారు. అదే విధంగా మార్కెట్ ప్రాంగణంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి సౌకర్యాలు మెరుగుపర్చేందుకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా జాతీయ స్థాయి ఐటీ ఎగ్జిబిషన్


జాతీయస్థాయి ఐడి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న అధ్యాపక బృందం విద్యార్థులు.

మెహిదీపట్నం, మార్చి 24, ప్రభాతవార్త :
మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో మంగళవారం కంప్యూటర్ అప్లికేషన్స్ (పీజీ) విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఐటీ ఎగ్జిబిషన్ – మోడల్ బిల్డింగ్ పోటీ ప్రదర్శన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఇంటెలెక్ట్ ఇన్ఫర్మాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెడ్ ఆఫ్ ఏ ఐ డాక్టర్ అబీబివుల్లా మహమ్మద్, గ్లోబల్ ఆగ్నేటిక్ ఏ ఐ కాన్సటోరియం ఫౌండింగ్ మెంబర్ డాక్టర్ సి.వి.మహేష్ కుమార్ లు హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మక ఆలోచనలు మరియు సాంకేతిక నైపుణ్యాలను ప్రశంసించారు. ఈ ప్రదర్శనలో ఐటీ రంగంలోని కొత్త ధోరణులను చూపించే వివిధ మోడళ్లు ఆకట్టుకున్నాయి. అనంతరం డాక్టర్ సి.వి.మహేష్ కుమార్ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థుల సృజనాత్మకత, ప్రదర్శన మరియు సమస్యల పరిష్కార విధానాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. విజయరాణి పాల్గొని మాట్లాడుతూ...కంప్యూటర్ టెక్నాలజీ లో వచ్చిన మార్పులను విద్యార్థినులు మరింతగా ఉపయోగించుకొని కెరీర్‌ను డెవలప్ చేసుకోవాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు మరియు సంస్థల నుండి విద్యార్థులు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో పాల్గొనగా విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పి.నాగకవిత, డాక్టర్ టి పుష్పలత, కాలేజీ డీన్స్, అధ్యాపకులు పాలొన్నారు.

మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎస్సీ ఉపకులాల వారికే కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న భైరి వెంకటేశం

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: ఈ ఏడాది భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా ఎస్సీ ఉప కులాలకే ఇవ్వాలని ఎస్సీ 57 కులాల హక్కుల పోరాట సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం మాల, మాదిగ కులాలకు మాత్రమే ఛైర్మన్ పదవులు ఇస్తూ మిగిలిన 57 కులాలను ప్రభుత్వం విస్మరిస్తున్నదని పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన తరువాత 57 ఎస్సీ ఉపకులాలకు సామాజిక న్యాయం చేయడం లేదని, ఈ సారి అధికారికంగా నిర్వహించే మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ ఉపకులాలకు కేటాయించాలని, తూ తూ మ ంత్రంగా ఈ ఉత్సవాలను నిర్వహించకుండా ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి గౌరవ ప్రథమంగా హాజరై నిర్వహించాలని, ఈ మేరకు మంత్రికి వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఉప కులాల నాయకులు సనాథన్ రాయిల క్రీనర్సయ్యా, తాలుకా రాజేందర్, భైండ్ల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


బిఆర్ఎస్ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మంగళవారం బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్‌ను బోయిన్‌పల్లి పోలీసులు హౌజ్ అరెస్ట్ చేసిన దృశ్యం

తెలుగు రంగస్థలం కళామతల్లి వారసత్వ వీలునామా : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, మార్చి 24 ప్రభాతవార్త : తెలుగు రంగస్థలం కళామతల్లి మనకు వ్రాసి ఇచ్చిన వారసత్వ వీలునామా అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. అలనాటి మహామహులు మనకిచ్చిన మనతాలూకు గత చరిత్ర, సంపద, వైభవం, ఘనకీర్తి అన్నారు. డా. కందిమళ్ల సాంబశివరావు నిరంతర పరిశోధకుడుగా కొంగ్రొత్త ఆలోచనలతో నాటకంపట్ల చూపిస్తున్న ఆసక్తి అందరికీ స్ఫూర్తి యువతకు ఆదర్శమని, నాటకసంస్థలకు కనువిప్పు అన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. డి.విజయభాస్కర్ అజో విభొ కందాళం రంగస్థల సేవాసమానం సభూతో నభవిష్యతి అన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్య నారాయణ సమర్పణలో డా. కందిమళ్ల సాంబశివరావు సంధానకర్తగా రూపొందించిన గంట నిడివిగల అలనాటి మేటి రంగస్థల మహామహా నటీనటుల నవరసభరిత నటనాచాతుర్యం, మాటలు, డైలాగులు శ్రవ్య దృశ్య కళారూపకం మనల్ని గతంలోకి తీసుకువెళ్లి మన నాటకరంగ సుసంపన్ని కళ్లకుకట్టిందన్నారు. తెలుగు రంగస్థలం కొందరనుకుంటున్నట్లు క్షీణదశలోనో హీనదశలోనో

సభలో ప్రసంగిస్తున్న రమణాచారి, నిత్యానందరావు, విజయభాస్కర్, మూర్తి, సాంబశివరావు, సత్యనారాయణ తదితర అతిథులు

ఉందని చింతపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అజో-విభొ-కందాళం ఫౌండేషన్, రసరంజని హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య అప్పాజోస్యుల సత్య నారాయణ సమర్పణలో నాటకరంగ ఆచార్యుడు డా. డిఎస్ఎన్.మూర్తి సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని ప్రివ్యూ థియేటర్‌లో అలనాటి నాటక ప్రస్థానం నాటి మేటి నటీనటులు శ్రవ్య దృశ్య కళారూపక పరిచయ సభకు ముఖ్యఅతిథిగా డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. డి.విజయభాస్కర్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. శ్రవ్య దృశ్య సంధానకర్తగా డా. కందిమళ్ల సాంబశివరావు వ్యవహరించారు.

తెలంగాణ సంప్రదాయ కళలను భావితరాలకు అందించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

రవీంద్రభారతి, మార్చి 24 ప్రభాతవార్త : తెలంగాణ శాస్త్రీయ సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరముందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ భరతనాట్య శిక్షణా సంస్థ నర్తనం ఆర్ట్స్ 3వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ విశిష్ట అతిథులు గురు వర్షిణి, డా. పి.రవిచంద్ర, కృష్ణవేణి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడుతూ మన సంస్కృతి, కళలను కాపాడడంలో నర్తనం సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ డైరెక్టర్, బాలశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత భరతనాట్య నృత్యకారిణి, గురువు వర్షిణి వందకుపైగా విద్యార్థులకు భరతనాట్య శిక్షణిచ్చి గొప్పకళాకారులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. తమ సంస్థ జాతీయంగానే కాకుండా అమెరికా, మలేషియావంటి పలుదేశాల్లో సంస్థ విద్యార్థులచే ప్రదర్శనలిచ్చినట్లు వర్షిణి తెలిపారు. సభకుముందు వార్షికోత్సవ ప్రదర్శనలను సంస్థ విద్యార్థులు పుష్పాంజలి

సంస్థ గురువు వర్షిణిని సత్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర అతిథులు

అంశంతో ప్రారంభించి గణేశ పంచరత్నం, అలరిప్పు, అర్ధనారీశ్వరస్తోత్రంలతోపాటు వందమంది బాలవిద్యార్థులు భగవాన్ శ్రీరాముని బాల్యజీవితాన్ని వర్ణిస్తూ భరతనాట్యశైలిలో ప్రదర్శించిన బాల రామాయణం ప్రేక్షకులను తన్మయుల్నిచేసి ఆధ్యాత్మికమార్గంలో పయనింపజేసింది. చివరిగా సంస్థ డైరెక్టర్ వర్షిణిని, ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సత్కరించి శుభాశీస్సులందజేశారు.

ప్రభుత్వం తెచ్చిన 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు'

అమ్మనాన్నల ఆత్మగౌరవానికి భరోసా : సిపి సజ్జనార్

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త

వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే బిడ్డల జీతం నుండి నేరుగా వారికి కొంత భాగం చెందేలా తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు' మానవీయ విలువలను పట్టం కట్టింది. ఇదే దేశానికి దిక్సూచి అని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఎక్స్ వేదికగా కొత్త బిల్లుపై ప్రశంసల వర్షం కురిపించా రు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కేబినెట్ 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు'కు ఆమోదం తెలి పింది. వృద్ధాప్యంలో కన్నవారిని నిర్లక్ష్యం చేసే ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 10 శాతం లేదా గరిష్టంగా రూ. 10 వేలను నేరుగా తల్లి దండ్రులకు చెల్లించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ నిర్ణయంపై సీపీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికే స్ఫూర్తిదాయకమని, వృద్ధ తల్లిదండ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడే భరోసా అని ట్విట్టర్ వేదికగా కొనియాడారు.

హోటల్ కార్మికుడు మృతి సంఘటనలో ట్రాలీ డ్రైవర్ అరెస్ట్

చార్మినార్, మార్చి 24 ప్రభాతవార్త : ఆటో ట్రాలీ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలై ఓ హోటల్ కార్మికుడు మృతి చెందిన సంఘటనలో ట్రాలీ డ్రైవర్‌ను హుస్సేనీఆలం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.... మహబూబ్‌నగర్ జిల్లా, కొందుకూరు ప్రాంతానికి చెందిన మల్లేష్ (58) పాతబస్తీ బహదూర్‌పురలోని షహీన్ రెస్టారెంట్‌లో కార్మికుడు ఐదు సంవత్సరాలు నుంచి పని చేస్తున్నాడు. హోటల్ పై అంతస్తులో ఉన్న గదిలో మల్లేష్ నివాసం ఉంటున్నాడు. సోమవారం మల్లేష్ హోటల్‌లో పనిచేయటానికి వెళ్లలేదు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మల్లేష్ సిటీ కళాశాల చౌరస్తా నుంచి పురానా పూల్ వైపు నడుచు కుంటూ వస్తున్నాడు. సిఎఆర్‌హెడ్ క్వార్టర్స్ రహదారి మీదుగా వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ట్రాలీ మల్లేష్‌ను ఢీకొట్టింది. మల్లేష్ అదుపు తప్పి ప్రక్కనే ఉన్న డివైడర్‌పై పడటంతో ముక్కుకు, కన్నుకు గాయాలు కావటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కాగా ఆటో ట్రాలీ డ్రైవర్ షేక్ ఖలీల్‌ను అరెస్ట్ చేశామని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రంజిత్‌రెడ్డిని పరామర్శించిన బిజెపి నేతలు

రంజిత్‌రెడ్డి తల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చికోటి ప్రవీణ్, ప్రదీప్‌రావు తదితరులు.

జూబ్లీహిల్స్, మార్చి 24, ప్రభాతవార్త: చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ జి. రంజిత్ రెడ్డిని మంగళవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ పరామర్శించారు. రంజిత్‌ంరెడ్డి మాతృమూర్తి జి. చంద్రకళమ్మ ఇటీవలి మృతిచెందడంతో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంలో జూబ్లీహిల్స్‌లోని రంజిత్‌రెడ్డి నివాసానికి విచ్చేసిన ఆయన చంద్రకళమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి : సూర్యప్రసాద్

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు నాగరాజు, లీగల్ అడ్వైజర్ జి.సూర్యప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ జె.బి.ఎస్.వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2017లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వేతన సవరణలో రావాల్సిన బకాయిలు ఇప్పటికి చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్టీసీ రెగ్యులర్, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించి వారి ఆకలి బాధలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓ సీతయ్య

-బైక్‌తో విన్యాసాలు చేస్తున్న ఇద్దరు యువకులు అరెస్ట్

ముషీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: ప్రజా భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓ ఏ.సీతయ్య స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో రీల్స్ కోసం తెలంగాణ సెక్రటేరియట్ మరియు లుంబినీ పార్క్ తదితర ప్రాంతాలలో బైక్ స్టంట్లు చేస్తూ, ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇద్దరు యువకులను సైఫాబాద్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీతయ్య తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వివరిస్తూ ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ అఖిల్ (19), అఘాపురాకు చెందిన మొహమ్మద్ అతీక్(22)లు గత కొంత కాలంగా తమ మోటార్ సైకిళ్లపై సెక్రటేరియట్ సమీపంలోని బహిరంగ రహదారులపై రీల్స్ కోసం ప్రాణాలకు ముప్పు కలిగించే స్టంట్లు చేస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం, నిరంతర నిఘా ద్వారా సైఫాబాద్ పోలీసులు నిందితులను గుర్తించి, వారి వద్ద నుంచి స్టంట్లు చేయటానికి వినియోగించిన బైకు, వీడియోలు తీయటానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. కేవలం సోషల్ మీడియాలో గుర్తింపు కోసమే ఇటువంటి బాధ్యతారహిత చర్యలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని, నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో ఐపి.పరమేశ్వరి, కానిస్టేబుల్స్ ఎల్.సంపత్‌కకుమార్, బి.విజయ్ కుమార్, జె.లింగస్వామి, ఎస్.మహేష్ కీలకంగా వ్యవహరించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఎవరైనా తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను పణంగా పెట్టి, ఇటువంటి వెర్రి చేష్టలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ హెచ్చరించారు.

వడ్డెర కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలి

జూబ్లీహిల్స్, మార్చి 24, ప్రభాతవార్త:
కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఫిలింనగర్ డివిజన్ వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో వారిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఐలమల్లు పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వడ్డెర కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని, వడ్డెర్లను ఎస్టీలో చేర్చాలని, క్వారీల్లో రిజర్వేషన్లు వెంటనే కల్పించాలని, ప్రభుత్వ పనుల్లో గతంలో ఉన్న 15 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలని వారు కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు వచ్చిన తరువాత ఈ రిజర్వేషన్లు ఒకటిన్నర శాతానికి తగ్గించారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని, అక్రమ అరెస్టులకు భయపడేది లేదని హెచ్చరించారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఫిలింనగర్ డివిజన్ వడ్డెర సంఘం నాయకులు జెరిపెట్టి మాణిక్యం, మక్కల నారాయణ, జూబ్లీహిల్స్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, మంజలి నరసింహ, వరికుప్పల దేవేందర్ తదితరులున్నారు.

ఫిల్మ్‌నగర్ ఠాణా ముందు వడ్డెర సంఘం నాయకులు.

ఆస్తి పన్ను చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

-అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య



అత్తాపూర్ మార్చి 24, ప్రభాతవార్త :
ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని అత్తాపూర్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఎంఎం పహాడి ప్రాంతంలో డిసి సమ్మయ్య, ఎఎంసి నిర్మల ఆధ్వర్యంలో పన్ను వసుళ్లపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎం క్యూ బ్యాంక్వెట్ హాల్ యజమాని సయ్యద్ అయూబ్ అలీ హూస్సెన్‌కు చెందిన వాణిజ్య ఆస్తిపై 11,39,149 ప్రాపర్టీ పన్ను బకాయిలు ఉండడంతో అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ..ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందని కాబట్టి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చసుకోవాలని బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఐ హరికిషన్, ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

కంసరి బజార్‌లో ఘనంగా సీతారామ వసంత వేడుకలు


1వ వార్డు కంసరి బజార్ శ్రీరామ మందిరంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: 1వ వార్డు బోయిన్‌పల్లి కంసరి బజార్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీరామ మందిరంలో మంగళవారం 68వ శ్రీ సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్ జంపన విద్యావతి, ఆలయ కమిటీ అధ్యక్షులు అరుణ్ గౌడ్, నాగరాజు, సంతోష్ శర్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులు చలో అసెంబ్లీ ముట్టడికి యత్నం..అరెస్టు

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరులకు ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన ఆనేక మంది వడ్డెరులను పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అసెంబ్లీ ఎదురుగా ఉన్న మెట్రో స్టేషన్ వద్ద నుంచి అసెంబ్లీ వైపు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయ కులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు సందర్భంగా మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా వడ్డెరుల డిమాండ్లను అమలు చేయాలని కోరారు.

దివ్యాంగుల హామీలను అమలు చేయాలని బిజెపి అసెంబ్లీ ముట్టడికి యత్నం

సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిజెపి మరోసారి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యం లో ఆనేక మంది దివ్యాంగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులు బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ నుంచి అసెంబ్లీ వైపుకు కాలినడకన బయలు దేరారు. కొంత దూరం వెళ్ళిన తరు వాత పోలీసులు నిరసన కారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బిజెపి కార్యకర్తల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు వారిని బలవంతం అరెస్టు చేశారు. అంతకు ముందు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. అర్హులైన దివ్యాంగులందరికి పెన్షన్ పెంచాలని, అలాగే ఇతర డిమాండ్లను అమలు చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి


ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్

సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: సంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మంగళవారం చార్మినార్ జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ కర్ణన్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్మాణ పనులకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డిసి మంగతాయారు. ఇంజనీరింగ్ ఎస్ఈ ఇందిర, ప్రాజెక్ట్ ఎస్ఈ మోహన్‌రెడ్డి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కొంతం దీపిక

కంటోన్మెంట్, మార్చి 24 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని శివాజీ నగర్, మారుతీ వీధిలలో కొనసాగుతున్న సీసీరోడ్డు, సివరేజ్ లైన్ అభివృద్ధి పనులను మంగళవారం మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక, పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత ఇంజనీర్లకు ఆమె సూచించారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా రాఘవులు దేవళ్ల

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త :


బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన రాఘువులు దేవళ్లను సన్మానిస్తున్న తోటి న్యాయవాదులు సీనియర్లు, ఇతర ప్రముఖులు

తెలంగాణ బార్‌కౌన్సిల్ ఎన్నికల్లో రాఘవులు దేవళ్ల విజయం సాధించారు. జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎన్నికల ఫలితాలను తాజాగా ప్రకటించారు. జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో ఈ ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తంగా 55 మంది మహిళలతోపాటు 203 మంది పోటీచేశారు. ఓట్ల లెకింపు ప్రక్రియ ఫిబ్రవరి 10న ప్రారంభంకాగా.. 23 మంది బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ నేటి (మంగళవారం) తో పూర్తయ్యింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో రాఘవులు దేవళ్ల విజయం సాధించారు. ఆయన ఇంతకు ముందు డిఆర్‌టి (డెబిట్ రికవరి ట్రిబ్యూనల్) జనరల్ సెక్రటరీగా సేవలందించారు. విజయానంతరం డిఆర్‌టి లో న్యాయవాదులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు సీనియర్ న్యాయవాదులు, జికె దేశ్‌పాండే, విజయ్ కుమార్, శ్రీధర్‌రెడ్డి తదితర న్యాయవాదులు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవులు దేవళ్ల మాట్లాడుతూ.. అడ్వకేట్ల సమస్యల పరిషారానికి పనిచేస్తానని తెలిపారు. అడ్వకేట్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన విజయానికి అవిరళ కృషి చేసిన టిమ్ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దీక్షా దివాస్ కేసును కొట్టివేసిన న్యాయస్థానం

హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త: దీక్షా దివాస్" కేసులో బిఆర్ఎస్ నాయకులు, మన్నె కృష్ణాంక్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జగన్మోహన్ రావు, చిరుమామిళ్ల రాకేష్, టైగర్ గొపగాని రఘురామ్ కదారి స్వామి యాదవ్ పై నమోదైన ఆరోపణలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ మొదటిజ్యూడిషనల్ మెజిస్టేట్ కోర్టు కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ లీగల్ సెల్‌కు చెందిన అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ మాట్లాడుతూ, హైకోర్టు జారీ చేసిన ఆదేశాల ప్రతిని నేడు నాంపల్లి కోర్టు ముందు సమర్పించినట్లు తెలిపారు. ఆ ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, కేసులో ఆరోపణలకు తగిన ప్రామాణిక ఆధారాలు లేవని గుర్తించి, కేసును పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. నిరాధార ఆరోపణలపై నమోదు చేసిన ఈ కేసులో చివరికి న్యాయం విజయం సాధించిందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్
చింతల్ సర్కిల్-54

నిట్ నం & తేది: 04/DB/EE/చింతల్ సర్కిల్-54/CMC/2025-26 తేది: 24.03.2026
పనిపేరు: పూరికేతిత పనులు (5నం.లు). అంచనా మొత్తం లక్షలలో: 32.00 లక్షలు. ప్రారంభ తేదీ & సమయం : 25-03-2026 ము.3.00గం. వర, బిడ్ సీలకరణకు చివరి తేదీ & సమయం: 28.03.2026 ము.3.00గం. వర, టెండర్ ఆహ్వానింపు అధారటీ వివరాలు మొబైల్ నం.తో : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నం: 9701414306 హెడ్ డ్రాఫ్ట్స్‌మన్: సెల్ నం: 8712034411. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, GHMC.
DIPR.NO. 17567-PP/CL/ADVT/1/2025-26 తేది: 24.03.2026

DOCUMENTS MISSING

Notice is hereby given to general public that the property being Flat No. 203 in the 1st Floor of the GURU KRUPA building complex, having it super built up area of 276 Sq.Feet which includes the common areas together with undivided share of land admeasurng 8 Sq.Yds equivalent to 6.7 Sq.Mts, from out of the total land area of the building complex admeasuring 477 Sq.Yds of the premises bearing municipal Number, 7-1-471 and 472 admeasuring 477 SqYds equivalent to 399 Sq.Mts situated at Ameerpet Hyderabad belongs to my client **Smt. KUSUMBA MANOGNA @ Smt. KUSUMBA VASAVI** purchased under Sale Deed bearing Document No.3604/2004, dated 22-11-2004, registered at HYDERABADSub-Registrar's office.

On 26th February, 2026 at about 10.10 A.M my client was travelling with the Original Document on the eve of his Sons Marriage function, at NOMA FUNCTION HALL, Nacharam, Rangareddy District, Hyderabad unfortunatelythe above said original document have fell down from the vehicle and the same are not traceable even after number of attempts in tracing the same. If anybody is in possession of the original documents relating to the said property, they are requested to hand over the same to the below address.

YADDANAPUDI SIVA GOPAL, Advocate
H.No. 1-9-278/3/1,
Plot No. 112, Lalitanagar,
Ramnagar Gundu,
Hyderabad 500 044,
Telangana.
Mobile No. 9440470639.

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT:: MEDCHAL
OS No.54/2024
(Old O.S.No. 280 OF 2015)
BETWEEN
1.Mr.A.Narsimha (died) as per Lrs AND OTHERS ....Plaintiff
AND
1. Smt.Akkenaboina Bharatamma& OTHERS ....Proposed Defendants
To
1. Smt. P. Mallamma W/o P. Satyanarayana Yadav, D/o A. Sattaiah, Aged about 45 Years, Occ: House Wife, R/o H.No. 33-29/4, Rajeevgandhi Nagar, Qutubullapur Mandal, Medchal Malkajgiri District.
2. Smt. S. Lakshmi W/o S. Venkatesh Yadav, D/o A. Sattaiah, Aged about 40 Years, Occ: House Wife, R/o H.No. 14-92, Old Mirjalguda, Malkajgiri Mandal, Medchal Malkajgiri District.
3. Smt. M. Sujatha W/o M. Arun Kumar, D/o A. Sattaiah, Aged about 34 Years, Occ: House Wife, R/o H.No. 17-486, I.N.Nagar, Malkajgiri Mandal, Medchal Malkajgiri District.
Whereas, the Plaintiff has filed the above suit against defendant No. 1 to 7 for injunction and whereas the Summons were served to the D5 to D7 to the Known address but the Defendant No.5 to D7 were trying to avoid in receiving the summons and under those circumstances, the Hon'ble court ordered substituted service of notice by way of paper publication and therefore this court notice of paper publication to the defendant No.5, D6 and D7is made.
Therefore, you, the defendant No. 5, D6, D7 to appear before this Hon'ble II Addl. District Judge, Medchal Malkajgiri District at Medchal on 7-04-2026 at 10.30 AM either in person or through your advocate, failing which the Hon'ble court may proceed in the matter in accordance with the law.
// BY ORDER OF THE COURT//
Sd/-**M/S. S. SIVA SHANKER,**
Advocate,
R/o. Flat No.407/6-1-9&10,
Padma Rao Nagar, Secunderabad-25
9246169599/9848036479

IN THE COURT OF THE HON'BLE III ADDL.JUNIOR CIVIL JUDGE-CUM- X ADDL.JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL
O.S.NO. 839 OF 2025
Between:-
UppalaAmareshwar and others ... Plaintiffs
And
The Tahsildar, QuthbullapurMandal, Medchal – Malkajgiri District ... Defendant
To,
The Tahsildar, QuthbullapurMandal, Medchal – Malkajgiri Dist.
Please take notice that my clients UppalaAmareshwar, UppalaArvind and UppalaAruna all are R/o. H.No.9-238, Sanjaygandhinagar, Quthbullapur, Medchal – Malkajgiri District, filed a suit for Declaration to declare them as they are successors of the deceased Smt.Uppala Annapurna against Defendant i.e. Tahsildar, QuthbullapurMandal, but the above named Defendant avoided to take notices, as such instead of court summons herewith sending summons through this publication to said Defendant for appearance on dt: 15-04-2026 at 10-30 A.M. in above said court and make it convenient and appear personally or through your counsel, otherwise the matter will be decided on merits.
// BY ORDER OF THE COURT //
Sd/-
(SATISH GAIKWAD)
ADVOCATE
Plot No.230,
Venkatram Nagar,
Suraram,
QuthbullapurMandal,
Medchal – Malkajgiri District,
Cell: 8688584609

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-XIV ADDITIONALMETROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR
O.S.NO. 153 OF 2026
BETWEEN:
DOSA NIRMALA ... PLAINTIFF
AND
NELLUTLA SRIRAMULU
And another ... DEFENDANTSD-2
ALL CONCERNED
NOTICE
The Plaintiffs had filed the above suit for declaration to declare themas the Legal HeirsofLate Dosa Laxman @ D.Laxman @ D.Lakshman who died on 23.05.2015 in respect of Plot No.89, admeasuring 200 sq.yds or 167.23 sq.mts in Sy.Nos.33 & 34, situated at KawadipallyVillage, previously Hayathnagar Mandal now Abdullapurmet Revenue Mandal, RangaReddyDistrict and bounded on North : Plot No.88, South: Plot No.90, East: 30 Feet Wide RoadandWest: Plot No.78. The Hon'ble Court was pleased to order for publication of this noticefor your appearance in the above suit and the matter is posted to 07.04.2026 at 10.30a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or throughyour authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
(BY ORDER OF THE COURT)
Sd/
PALLE LINGAM GOUD
Advocate,
H.No.3-54, Marripally Village,
Peddamberpet Municipality,
Ranga Reddy District -501 505

మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి, ఆధ్యాత్మిక పురోగతికి మరో ముందడుగు

మల్కాజ్‌గిరిమార్చి. 24. ప్రభాతవార్త

మల్కాజ్‌గిరి నియోజ కవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అసెం బ్లీలో దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖని మర్యాదపూర్వ కంగా కలిసి వినతి ప త్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి నియోజకవర్గ పరిధిలోని సికింద్రాబాద్ మ హేంద్రహిల్స్ ప్రాంతంలో ఉన్న శ్రీ జయగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో ఇస్కాన్ సంస్థకు దేవాదాయ శాఖకు చెందిన భూమి ని కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రివర్యులను కోరారు .ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న ఇస్కాన్ సంస్థ భగవద్గీత బోధన, యువతకు నాయకత్వ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమా లు, యోగా శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ స మాజానికి విశేష సేవలందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అదేవి ధంగా అన్నదానం, ప్రసాదం పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆధ్యాత్మికతతో పాటు సా మాజిక సేవలను అం దిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సు మారు 500 నుండి 1500 చదరపు గజాల భూమిని కేటాయిం చి, శ్రీ కృష్ణ దేవాల యం, కళ్యాణ మండపం మరియు ఆధ్యాత్మి క, నైతిక విద్యా కా ర్యక్రమాల కోసం అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మె ల్యే విజ్ఞప్తి చేశారు. అందుకుగాను మంత్రి వర్యులు సానుకూలం గా స్పందించారు, ఈ కార్యక్రమం ద్వారా మల్కాజ్‌గిరి నియోజ కవర్గంలో ఆధ్యాత్మి క వాతావరణం మరింత బలపడటంతో పాటు ప్రజలకు మేలు కలిగే అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే గారు ఆశాభావం వ్యక్తం చేశారు.

పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక : ఆలీం

ఎంఐఎం నాయకులు ఆలీంకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా చౌకి రవికుమార్ , విజయ్ కుమార్, బాబు రాజు, డిజిఎం హస్మత్ అలీ తదితరులు

మలక్ పేట, మార్చ్ 24,ప్రభాతవార్త: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మలక్ పేట్ నియోజకవర్గం ఎంఐఎం సీనియర్ నాయకులు ఆ లీం పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మల క్ పేటలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో శ్రీ పోచ మ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, సీనియర్ నాయ కులు విజయ్ కుమార్, బాబు రాజు డిజిఎం హస్మత్ అలీ తదిత రులు ఆలీంను శాలువాలతో ఘనంగా సన్మానించి పండుగ శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలీం మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక గా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. చౌకి రవికుమార్ మాట్లాడుతూ పండుగలు ఐక్యత స్నేహభావం, ఆత్మీయతలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ కలిసిమెలిసి మతసామరస్యంతో ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులా

తుర్కయంజాల్ మార్చ్ 24, ప్రభాతవార్త

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో మన్నెగూడ వడ్డెర సంఘాల నాయకులు అసెంబ్లీ ముట్టడికై వెళ్తుండగా ఆదిభ ట్ల పోలీస్లు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డెరలకు ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెరలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చే యాలని వారు అన్నారు, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్ట్ అయిన తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర కన్వీనర్ గోవుల పాంచన శ్రీను , తెలంగాణ వడ్డెర సంఘం చార్లబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి వేముల కుమార్, తెలంగాణ వడ్డెర సంఘం చాల్వా బుల్ ట్రస్ట్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు గండికోట రాజు, పాల్గొన్నారు

ద్రవ్యోల్బణ ప్రభావంపై విస్తృతోపన్యాసం కార్యక్రమం



నేరెడ్ మెట్ , మార్చి 24 ,ప్రభాతవార్త : ప్రభుత్వ డిగ్రీ కళాశా ల, మల్కాజిగిరిలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో"ఆర్థిక వ్యవ స్థపై ద్రవ్యోల్బణ ప్రభావం" అంశంపై విస్తృతోపన్యాస కార్యక్ర మం నిర్వహించారు. విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎడ్ల ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నారాయణగూడలోని బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర ఆచార్యు లు కలువల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన ద్రవ్యోల్బణం ఏర్పడే కారణాలు, దాని ప్రభావం సామాన్య ప్రజల జీవన విధానంపై ఎలా ఉంటుందో వివరించా రు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ధరల పెరుగుదలను నియంత్రిం చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వ్యక్తిగతంగా ఖర్చులను నియంత్రించడం, పొదుపు అలవాట్లు పెంపొందించు కోవాల్సి న అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ఇన్‌ఛా ర్జ్ ప్రిన్సిపాల్ గుణాకర్ మాట్లాడుతూ ఇటువంటి శాస్త్రీయ కార్య క్రమాలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక దృష్టిని పెంపొందిస్తాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు ప్రస్తుత పరిస్థితుల్లో ద్రవ్యోల్బణంపై అవగాహన అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి మత్తులో మొబైల్ షాప్‌పై యువకుడు దాడి

మలక్ పేట ,మార్చి 24, ప్రభాతవార్త: గంజాయి మత్తులో ఓ యువకుడు మొబైల్ షాప్ పై కొడవలితో దాడి చేసి షాపులోని వస్తువులను పారేసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకా రం అజంపుర లోని సెల్ ఫోన్ షాపులోకి సోమవారం రాత్రి గం జాయి మత్తులో ఆర్బాజ్ అనే యువకుడు ప్రవేశించి షాపులోని వస్తువులను పారేసి కొడవలితో మొబైల్ షాప్ నిర్వాహకులపై దాడికి దిగాడు. దీంతో స్థానికులు చాదర్ ఘాట్ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన ప్రాంతానికి హుటాహుటిన చాదర్ ఘాట్ పోలీసులు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో ఎలా కృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుండి గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

వనస్థలిపురం. మార్చి. 24.ప్రభాతవార్త

దీర్ఘాకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎన్.జి.ఓస్.కాలనీ గ్రంథా లయం పనులు బుధవారం (నేటి) నుండి ప్రారంభం అవు తాయని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం ఎన్.జి.ఓస్.కాలనీవాసులు లైబ్రరీ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథి గా ఎమ్మెల్యే శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అందరు గ్రంధాలయం పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రంధాలయం పనులు తాను ఎప్పుడు ఆపలేదని కొందరు బి.జె.పి.కార్పొరేటర్ల దుందుడుకు చర్యల కారణంగా పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రంధాలయం పనులు రేపటి నుండి ప్రారంభిం చాలని అక్కడే ఉన్న గ్రంథలయం ఈ.ఈ. మరియు డి.ఈ. గార్లను ఆదేశించారు. రేపటి నుండి గ్రంధాలయం పనులు ప్రారంభం కానుండడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలందరు ఎమ్మెల్యే దేవిరె డ్డి సుధీర్ రెడ్డి మరియు బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డిని సన్మానించా రు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ కాలనీపెద్దలు సోమయా జులు, పంపన్న వెంకటేశ్వర, శివనాగేశ్వర్ రావు, వేముల జైపాల్ రెడ్డి, వర్ధని, శశిధర్ రెడ్డి, ఓంప్రకేష్, భూషణ్, విశ్వనా థం, శ్యాంకుమార్, ఆనంద్ ఎన్జీవోస్ కాలనీపెద్దలు, చుట్టు పక్కల కాలనీపెద్దలు మరియు భారస నాయకులు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరీ, యూత్ అధ్యక్షులు మునగాల రాఘవేందర్ రావు, కొంగర మహేష్, నీళ్ల రాజశేఖ ర్ గౌడ్, నరేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, అమర్థ్య రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారామ చంద్రస్వామి వారి ఊరేగింపు కార్యక్రమం

ఎపిఎయు కాలనీలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు రుద్రరాజు రమేష్ రాజు, చిత్రంలో నాయకులు నవీన్ పాటలే, వంజరి వినోద్ కుమార్ తదితరులు

మలక్ పేట, మార్చ్ 24, ప్రభాతవార్త: ఆస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఎయు కాలనీలోని ధర్మ నిలయంలో శ్రీరామ నవమి మహోత్సవాలలో భాగంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగ నిర్వహించారు. అదేవిధంగా మంగళవా రం ఉదయం నగర సంకీర్తన, శ్రీరామ పూజ, ఏక రుద్ర ము, శ్రీ వినాయక, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఆంజనే య స్వామి వారి హోమము, శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం, శ్రీరామ కోటి పఠనము తదితర కార్యక్రమాల ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, స్వాధిష్ఠ సేవా సమితి ప్రతినిధులు రుద్రరా జు రమేష్ రాజు, నవీన్ పటాలే, మడిగెల విజయభాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలు మాట్లాడుతూ శ్రీరామనవమి మహో త్సవాలలో భాగంగా ఉగాది నుండీ శ్రీరామనవమి వరకు ఎపిఎయు కాలనీ ధర్మ నిలయములోని అమ్మ గారి నిల యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభ వంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, కొత్తకాపు రవీం దర్ రెడ్డి, జిట్టా సురేందర్ రెడ్డి, వంజరి వినోద్ కుమార్, మడిగేల లక్ష్మారెడ్డి, చందు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో దాహం..దాహం..

-దేవాలయంలో తాగునీటి సమస్యతో భక్తుల ఇబ్బందులు

అలంకార ప్రాయంగా మారిన నీళ్ల లేని త్రాగునీటి కూలర్లు

సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా ఉన్న కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తులకు త్రాగునీరు దొరకక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దేవాలయ ఆవరణలోని టికెట్ కౌంటర్ పక్కన దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మూడు త్రాగునీటి కూలర్స్‌లో నీరు రావడం లేదు. కేవలం నిర్వాహణా లోపం కారణంగానే తరచుగా దేవాలయంలో త్రాగునీటి సమస్య తలెత్తుతుందని భక్తులు వాపోతున్నారు. దేవాలయానికి ప్రతి నిత్యం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. పర్వదినాల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉం టుంది. కుటుంబ సభ్యులతో పాటు వచ్చే భక్తులు స్వామి వారి దర్శనం అనంతరం దేవాలయ ఆవరణలో కాసేపు కూర్చుంటారు. చాలా వరకు చిన్నపిల్లలతో వచ్చే భక్తులు ఉంటారు. చిన్నారులు ఎవరైనా త్రాగునీరు కావాలని అడిగితే త్రాగునీటి కుళాయిల వద్దకు వెళ్తే చుక్క నీరు రాక పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పట్టించుకోని ఈఓ, చైర్మన్....

దేవాలయంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి అటు కార్యనిర్వాహణాధికారి గాని, ఇటు పాలక మండలి చైర్మన్ గాని చర్యలు చేపట్టక పోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్య క్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగనుండడంతో త్రాగునీటి కోసం భక్తులు వెతకడం సర్వ సాధారణం. ఇప్పటికైనా దేవాలయంలో త్రాగునీరు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఉప్పల్ నియోజకవర్గంలో చెరువులకు మహర్ధశ : ఎంపిఆర్

ఉప్పల్ పెద్ద చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం లో చెరువులకు మహర్ధశ పట్టనుందని కాంగ్రెస్ పార్టీ ఇంచా ర్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు ఈ మేరకు మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి ఉప్పల్ పెద్ద చెరువును పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ రూ.102 కోట్లతో సుందరీక రణతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నాచారం చెరువులో త్వరలోనే అభివృద్ధి, సుంద రీకరణ పనులను చేపట్టనున్నట్టుగా హైడ్రా కమిషనర్ రంగ నాద్ తెలిపారు. రూ.30 కోట్ల నిధులతో త్వరలోనే పనులు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలో మొదటి విడతలో నాలుగు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధు లు సైతం మంజూరు చేయించినట్టుగా చెప్పారు. ఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లు, పెద్ద చెరువు రూ.30 కోట్లు, కాప్రా చెరువు రూ.35 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17 కోట్ల చొప్పున నిధులు వచ్చాయని తెలిపారు. ఇప్ప టికే ఉప్పల్ నల్లచెరువులో పనులను చేపట్టి తుది దశలో ఉన్నాయన్నారు. అతిత్వరలోనే నాచారం. మిగతా చెరువుల లో పనులను చేపట్టనున్నట్టుగా చెప్పారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రామకోటేశ్వరరావు, రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, హెచ్ఆర్ మోహన్, ప్రకాష్ రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, భావన గౌడ్, మహేష్ యాదవ్, రమేష్ గౌడ్, నూతలకంటి రాజు, సం తోష్ రెడ్డి, రాజి రెడ్డి, కృష్ణ యాదవ్, వెంకట్ రెడ్డి, వెంకట్ గౌడ్, తుంగ తిరుపతి, చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బజాజ్ జగన్ గౌడ్, ఆకిటి ఆగం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ముల్కపల్లి రాజేష్ ముదిరాజ్, కొంపల్లి బాలరాజ్, నల్లవెల్లి మహేందర్ ముది రాజ్, బొట్టు రాజేష్ ,పల్లె రమేష్ గౌడ్, మంచాల రఘు, రాధాకృష్ణ, శంకర్ ,గణేష్, కిరణ్, అమరేశ్వరి ,సుశీలమ్మ ,గీత, సమత తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో విద్యుత్ అధికారుల ప్రజాబాట

రామంతాపూర్‌లో ప్రజాబాటలో పాల్గొన్న చీప్ ఇంజనీర్ పి.వి.రమేష్, ఎస్ఇ పి.వెంకన్న, డిఇ సుబ్బారావు తదితరులు

రామంతాపూర్, మార్చి 24 ప్రభాతవార్త : రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీలో మంగళవారం విద్యుత్ శాఖ అధి కారులు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ చీప్ ఇంజనీర్ పి. వి.రమేష్, ఎస్ఐ పి.వెంకన్న, డిఇ కె.సుబ్బారావు తదితరు లు స్థానిక అధికారులతో కలిసి పలు కాలనీలలో పర్యటించా రు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులతో నేరుగా మాట్లాడి, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. రా బోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వినియోగదారు లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలని చీప్ ఇం జనీర రమేష్ స్థానిక అధికారులకు ఆదేశించారు. అలాగే లైన్లపై పనిచేసే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం హబ్సి గూడ స్టేషన్ నం. 8 సబ్‌స్టేషన్‌ను సందర్శించి, వేసవి యాక్షన్ ప్లాన్ కింద 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌గా మార్చే పనులను పరిశీలిం చారు. అనంతరం హబ్సిగూడ ఎస్ఇ కార్యాలయంలో అసి స్టెంట్ డివిజనల్ స్థాయి అధికారులతో సర్కిల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను వెంటనే పూర్తి చేయాలని, కొత్త విద్యుత్ కనెక్షన ్లను త్వరగా విడుదల చేయాలని, వినియోగదారుల ఫిర్యాదు లను వెంటనే పరిష్కరించాలని, రాబోయే వేసవికి సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: అనా రోగ్య కారణాలతో వివిధ ఆసుపత్రులలో చికి త్స చేయించుకున్న పేదలకు వారి ఆర్థిక పరిస్థి తిని దృష్టిలో పెట్టుకుని లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమం త్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించారు. పొలిశెట్టి కార్తీక్ కుమార్‌కు రూ. 42,500లు, కొయ్యలకొండ సాయి కుమార్‌కు రూ.42,500లు, కల్లెం లక్ష్మమ్మకు రూ.60 వేలు, వెంకటేశ్వరాచారికి రూ.45 వేలు, సువ ర్ణ నరసింహకు రూ.30 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరు అయ్యాయి. సదరు చె క్కుల ను మంగళవారం లబ్దిదారులకు అందజేశారు.

అనాధ విద్యార్థులకు చేయూత

ల్యాప్ టాప్ అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త: అనాధ పిల్లలకు ల్యాప్‌టాప్స్, స్కూ ల్ బ్యాగ్స్ ఇచ్చి వా రి భవిష్యత్తుకు బాసటగా నిలవడం అభినందనీయమని చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫిన్ కర్వ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, ఆగ్మాంట్ ఆధ్వర్యంలో ఆదర్శ ఫౌం డేషన్‌లోని అనాధ బాలురు, బాలికలకు సిఎస్ఆర్ కార్యక్రమం కింద ఆరు ల్యాప్‌టాప్స్, స్కూల్ బ్యాగ్ లను ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖ ర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సాయికుమార్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, ఆదర్శ ఫౌండేషన్ ఇంచార్జ్ ప్రదీప్, నాయకులు నరేందర్‌రెడ్డి, జలంధర్, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు పనులు పరిశీలించిన మాజీ కార్పొరేటర్

వనస్థలిపురం మార్చి24,ప్రభాతవార్త

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 1 కాలనీలో జరుగుతున్న బిటి రోడ్ నిర్మాణం పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యవేక్షించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కొరకు నిరం తరం కృషి చేస్తానని ,నాణ్యత పరిమాణాలతో పనులను నిర్వహించాలని మరియు కాలనీలలో ఏ సమస్యలైనా సరే తమ దృష్టికి తీసుకొస్తే సకాలంలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రావు, శ్రీనివాస్ రావు ,మాణిక్ ప్రభు మరియు బిజెపి పార్టీ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.

శోభయాత్ర వరకు పైపులైన్ పనులను క్లియర్ చేయాలి

ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హుడాకాంప్లెక్స్, 24 మార్చి, ప్రభాతవార్త : సరూర్‌నగర్ కట్ట నుండి గాంధీ బోమ్మ, సరూర్‌నగర్ పోస్టాఫీస్ వరకు జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఎప్రిల్ 2వ తేదీన జరుగబోయే వీర హనుమాన్ శోభయాత్రకు అటంకం కలుగకుండా క్లియర్ చేయాలని కోరుతూ లింగోజి గూడ డివిజన్ బిజెపి నాయకులు మంగళవారం సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హను మాన్ జయంతి సందర్భంగా లింగోజిగూడ, సరూర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని దేవాలయాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, శోభయాత్ర సజావుగా, ఎలాంటి అ టంకాలు లేకుండా జరిగేలా జిహెచ్ఎంసీ వారు సహకరించాల ని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అరుట్ల సురే ష్‌కుమార్, మల్కాజ్‌గిరి కుమార్, ప్రవీణ్‌కుమార్, రాములు గౌడ్, గోవర్ధన్, కృష్ణంరాజు (కిట్టు)తదితరులు ఉన్నారు.

దేశ నిర్మాణంలో యువతది కీలక పాత్ర : జితేందర్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

సైదాబాద్, మార్చి 24 ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా మహే శ్వరం నియోజకవర్గంలో అటల్ అండ్ కలాం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణా లను పెంపొందిస్తాయని అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం వంటి మహనీయుల ఆశయాల ను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పేజ్ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ బండి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీత రామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా ప్రారంభమైన శ్రీరామనవమి వేడుకలు

వనస్థలిపురం మార్చి. 24. ప్రభాతవార్త.

వనస్థలిపురం హిల్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి 28వ బ్రహ్మోత్సవాలు 24వ తేదీ. మంగళవారం నుడి 29 ఆదివారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ టి లక్ష్మారావు, ప్రధాన కార్యదర్శి చింతల రవికుమార్, కోశాధికారి డాక్టర్ పి. పద్మనాభరావు, మహేంద ర్ రెడ్డి లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళ వారం సుప్రభాత సేవ, హోమం, విష్ణు సహస్రనామ రామా యణ పారాయణం,. నూట ఎనిమిది కళాశాలచే అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ లక్షపార్చన అంకురార్పణ యాగశాల ప్రవేశం . పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అగ్ని ప్రతిష్ట, వైనతేయ ఇష్టి, ధ్వజారోహణం, గురువారం శ్రీ సుదర్శన, శ్రీ నరసింహఇష్టి ,27 మూలమంత్ర సహిత సంక్షేప రామాయణ హవనం,. పూర్ణాహుతి, శుక్రవారం ఉద యం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్స వం, అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం సాయంత్రం స్వా మివారి గరుడ వాహన సేవ, 28 లక్ష్మీ హయగ్రీవఇష్టి, శ్రీరా మ పట్టాభిషేకం సూర్యప్రభ వాహన సేవ, 28 మూలమం త్ర సహిత నిత్య హోమం పూర్ణాహుతి చంద్రప్రభవాన సేవ, 29 కుంభ సంప్రోక్షణం, చక్రస్నానము శ్రీ పుష్పయాగం. తది తర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపా రు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ సీతారామచంద్రస్వామి 28వ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు..

తొర్రూర్ రాజీవ్ గృహకల్ప దేవాలయ కమిటీ నియామకం

తుర్కయంజాల్ మార్చి24,ప్రభాతవార్త : తుర్కయంజాల్ తొర్రూరు డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీలో దేవాలయ ల అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. కాలనీలోని దేవాలయానికి కొత్త కమిటీని సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కమిటీ నియామకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించా రు. కమిటీ సభ్యులు ఆలయ నిర్వహణను పారదర్శకంగా కొనసాగించడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొ న్నారు. కాలనీ వాసులు కూడా తమ వంతు సహకారం అం దించి దేవాలయాన్ని అభివృద్ధి పరచాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కాలనీవాసులు పాల్గొన్నారు

సిఎం రేవంత్‌రెడ్డితో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

సిఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 24 ప్రభాతవార్త : తెలంగాణ సిఎం రేవం త్ రెడ్డితో మంగళవా రం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సం దర్భంగా వచ్చే వారం మల్కాజిగిరి మున్సి పల్ కమిషనరేట్ భూమి పూజ కార్యక్ర మానికి హాజరు కావలసిందిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సిఎంను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మా ట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలో మౌళిక వసతుల కల్పనతోపాటు, నాణ్య మైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని విన్నవించారు. ఉప్పల్ ని యోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌళిక సదుపా యాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్రాభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీంతో పాటు రామంతాపూర్‌లో కొత్త పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయా లని విన్నవించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని 2009లో నిర్మించిన ఇందిరా గృహ కల్ప పదకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్ల వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. సమస్యల ను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పలు చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణ కు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సిఎం రిలీఫ్ ఫండ్ : పారిజాత

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న చిగిరింత పారిజాత

సరూర్‌నగర్, మార్చి 24 ప్రభాతవార్త: నిరుపేదల ఆరోగ్యాని కి భరోసాగా సిఎం సహాయనిధి ఉంటుందని టిపిసిసి ప్రధా న కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్‌లో మంగళవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులైన అనారోగ్య బాధితులకు ప్రభుత్వం తరపున మంజూరైన చెక్కులను పారిజాత అందజేశారు. ఈ సందర్భంగా కుళ్ళ జంపయ్యకు రూ.40 వేల చెక్కును, దేవరత్ నందినికి రూ.60 వేల చెక్కును అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారంతో పేదలకు వైద్య చికిత్సల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరవుతున్నాయని అన్నారు. పేదల ఆరోగ్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తున్న దని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ కొలను తిరుపతిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాల్‌నింగని జంగయ్యతో పాటు బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు సామ భాస్కర్‌రెడ్డి, సిరిగని సాయి, గిరి ముదిరాజ్, మసూద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఛైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 24 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ బాలాపూర్ డివిజన్‌లోని బాలాపూర్ గ్రామంలోనున్న పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి (మహ దేవ్‌జీ) దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం జరిగిం ది. ఆలయ కమిటీ ఛైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇఒ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్లు, ఆలయ అర్చకుడు తదితరులు లెక్కించగా ఇటీవల భక్తులు వేసి హుండా ఆదాయం రూ.36,264 వచ్చింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడు తూ ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాకు జమ చేయిస్తామని తెలిపారు. గత నెలలో జరిగిన శివరాత్రి పర్వదినం సంద ర్భంగా అర్చనలు, అభిషేకాలకు సంబంధించిన టిక్కెట్ల విక్ర యాల ద్వారా అదే విధంగా పండుగ ఏర్పాట్లు, మరుసటి రోజు అన్నదానానికి సంబంధించి విరాళాలు మొత్తం రూ.1.83 లక్షలు వచ్చాయని వెల్లడించారు. కాగా మంగళ వారం జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో డైరెక్టర్లు ఇక్కె మాధవి శ్రీనివాస్ కురుమ, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, పగడాల ఉమేష్, ఆలయ అర్చకుడు దుర్గా ప్రసాద్, క్లర్కు గోపి, భక్తు లు సంరెడ్డి మహిపాల్‌రెడ్డి, కొలను శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డుపై ఆక్రమణలను పరిశీలించిన అధికారులు



సర్వీసు రోడ్లపై ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎసిపి కిరణ్‌కుమార్: చిత్రంలో వంటేరు నర్సింహారెడ్డి, మల్లారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 24 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడం గ్‌పేట్ సర్కిల్ పరిధిలోని టికెఆర్ కమాన్ నుండి మంద మల్లమ్మ చౌరస్తా వరకు గల సర్వీసు ఆక్రమణలను మంగళ వారం టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. జిల్లెలగూ డ డివిజన్-59 పరిధి కిందకు వచ్చే ఈ సర్వీసు రోడ్డులో ఆక్రమణల విషయమై మీర్‌పేట్ కాలనీ అసోసియేషన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి తదితరులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శంషాబాద్ జోనల్ కమీషనర్ తదితరులకు వినతి పత్రాలు సమర్పించి తగు చర్యలు తీసుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరడం జరిగింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ ఇంఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ కిరణ్‌కుమార్ సిబ్బం దితో కలిసి సర్వీసు రోడ్డును పరిశీలన జరిపారు. ఈ సంద ర్భంగా వంటేరు నర్సింహారెడ్డి తదితరులు వారికి సర్వీసు రోడ్డు ఆక్రమణలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందుల ను వివరించారు. అయితే సర్వీసు రోడ్డు ఆక్రమణలపై స్పం దించిన ఎసిపి రెండు రోజుల్లో ఆక్రమణలను తొలగించుకో వాలని స్థానిక వ్యాపారులకు సూచించారు. లేనిచో జెసిబితో తొలగిస్తామని స్పష్టం చేశారు.